


మూడో భాష ఎంపికలో
విద్యార్థులకు స్వేచ్ఛ లేదా?

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

సంపుటి - 3 సంచిక -143 గురువారం 12 నవంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -8 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

ఏ ఒక్కరికీ నష్టం లేకుండా మూసీ పునరుజ్జీవం

హైడ్రా పునరుద్ధరించిన తమ్మిడికుంట చెరువును ప్రారంభించిన ముఖ్యమంత్రి

చెరువుల చెర విడిపిస్తాం.. ఇక తమ్మిడికుంట ఫేమస్

భవిష్యత్ తరాలకు మేలు జరుగుతుందంటే..

కొందరికి నష్టం జరిగినా ఓకే: రేవంత్ రెడ్డి

మూసీ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికీ ఆహ్వానించాలి

పనులు పూర్తిచేసే శక్తి దేవుడు మీకివ్వాలి: నాగార్జున



హైదరాబాద్ సిటీ, నవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):

"మూసీ ప్రక్షాళన చేయాల్సిందే. ఏ ఒక్కరికీ నష్టం జరగకుండా ఆ నది పునరుజ్జీవ ప్రాజెక్టును చేపడతాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందుకు రాజకీయాలకతీతంగా సహకరించాలని.. అందరూ ఒకే వేదికపైకి రావాలని ఆయన కోరారు. 55 కిలోమీటర్ల మేర ఉన్న మూసీ ప్రక్షాళనలో భాగంగా.. 21 కిలోమీటర్ల మేర పనులకు అన్ని అనుమతులూ వచ్చాయని, త్వరలో పనులు మొదలు పెడతామని ఆయన తెలిపారు. ఐటీ కారిడార్‌లో రూ.20 కోట్లతో హైడ్రా పునరుద్ధరించిన**మిగతా 2లో...**

ఎరువుల సబ్సిడీకి రూ.62,370 కోట్లు

రబీ 2026-27 సీజన్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం

రైతులకు అందుబాటు ధరల్లో ఎరువులు..

అంతర్జాతీయ ధరల భారాన్ని తగ్గించే చర్యలు

యుగే యుగేన్ భారత్ మ్యూజియం నిర్మాణానికి రూ.3,230 కోట్లు

'స్టాండ్ అప్ ఇండియా' కు రూ.4,111 కోట్లు : కేంద్ర మంత్రి వర్గ నిర్ణయాలు



న్యూఢిల్లీ నవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):

రైతులకు అందుబాటు ధరల్లో ఎరువులను అందించడంతో పాటు వ్యవసాయ రంగానికి ఆర్థిక చేయూతనిచ్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 202627 రబీ సీజన్‌కు ఎరువుల సబ్సిడీగా రూ.62,370 కోట్లను కేటాయించేందుకు కేంద్ర మంత్రిపర్గం ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఎరువులు, వాటి తయారీకి అవసరమైన ముడి పదార్థాల ధరల్లో మార్పుల నేపథ్యంలో రైతులపై ఆర్థిక భారం పడకుండా ఈ చర్య చేపట్టినట్లు కేంద్రం**మిగతా 2లో...**



వచ్చే ఏడాది నుంచే 10+2 విధానం!

తెలంగాణ విద్యా వ్యవస్థలో భారీ మార్పులు..

అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యకు ప్రాధాన్యం

12వ తరగతి నుంచే నైపుణ్య శిక్షణ

హైదరాబాద్ నవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):

రాష్ట్ర విద్యా వ్యవస్థలో భారీ మార్పులకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచే పాఠశాల విద్యలో 10+2 విధానాన్ని అమలు చేయాలని**మిగతా 2లో...**

సంక్షేమం ఆగమైంది

కాంగ్రెస్ అసమర్థ పాలనతో ప్రజలకు కష్టాలు

- పంట పొలాలకు నీరు నిలిపేశారు

- ఇతర రాష్ట్రాలకు కరువు బృందాలు.. తెలంగాణకు మొండి చేయి

- 8 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలు ఉండి ఏం లాభం?

- ప్రధాని మోడీ ఇంటి ఎదుట ధర్నా చేయాలి: కేటీఆర్

నిర్మల్: నవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనతో ప్రజల సంక్షేమం కుంటుపడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు కరువు అంచనా బృందాలను పంపుతున్నప్పటికీ తెలంగాణకు పంపకుండా వివక్ష**మిగతా 2లో...**





వాటర్ రెగ్యులేటరీ

సాగునీటి ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష..

రెండున్నర ఏళ్లలో 36 ప్రాజెక్టులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

ఎత్తిపోతల పథకాలను జలహారతి కార్పొరేషన్ ద్వారా పర్యవేక్షించాలని సూచన

వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు అంశంపై అధ్యయనం చేయాలని ఆదేశం

అమరావతినవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):

ఏపీలో సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాల ప్రస్తుత పరిస్థితిపై ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి జలవనరుల శాఖ**మిగతా 2లో...**

సీఆర్పీఎఫ్ క్యాంపుపై ఉగ్ర దాడి

బైక్‌పై వచ్చి 15 సెకన్లలో 30 రౌండ్ల కాల్పులు

ముగ్గురు జవాన్లకు తీవ్ర గాయాలు

వారిలో ఇద్దరి పరిస్థితి విషమం

కశ్మీర్‌లోని కుల్గాంలో ఘటన



జీహెచ్ఎంసీకి జాతీయ అవార్డు

స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26లో హైదరాబాద్‌కు జాతీయ గుర్తింపు

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్



న్యూఢిల్లీ:నవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):

స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26 జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) జాతీయ అవార్డును అందుకుంది**మిగతా 2లో...**

విజయసాయిరెడ్డి.. కొత్త పార్టీ పీఆర్పీ

పరివర్తన రాజనీతి పార్టీని ప్రకటించిన విజయసాయిరెడ్డి

ఏపీ రాజకీయాల్లోకి మరో కొత్త వేదిక



అంతర్జాతీయ ప్రజల పత్రిక
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక

ఏ ఒక్కరికీ నష్టం లేకుండా మూసీ పునరుజ్జీవం

మొదటిపేజీ తరువాయి

తమ్మిడికుంటను.. సినీనటుడు అక్కినేని నాగార్జున, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి బుధవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ఆయన.. ప్రపంచంలో ఎక్కడైనా నదీ పరీవాహక ప్రాంతాల్లో అభివృద్ధి జరిగిందని, అమెరికా, సింగపూర్, దక్షిణ కొరియా వంటి దేశాలు నదుల తీర ప్రాంతాలను పర్యాటక, ఆర్థిక చోదక శక్తులుగా తీర్చిదిద్దాయని పేర్కొన్నారు. అదే తరహాలో హైదరాబాద్, తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోవాలన్నదే తన ఆలోచన అని స్పష్టం చేశారు. 'నా సంకల్పం మంచిదైనప్పుడు.. నేను చేసే పని భవిష్యత్ తరాలకు ఉపయోగపడుతున్నప్పుడు. కొందరికి నష్టం జరుగుతుందని ఎందుకు వెనక్కి తగ్గాలి' అని ప్రశ్నించారు. జెటర్ లోపల ఉన్న 1.34 కోట్ల మందితోపాటు.. నల్గొండ జిల్లాలోని 30 లక్షల మంది మూసీ కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నారని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరముందని రేవంత్ అభిప్రాయపడ్డారు. మెడికల్, ఇతర వ్యర్థాల డంపింగ్ కేంద్రంగా మూసీ నది మారిందని, ఈ పరిస్థితిని పూర్తిగా మార్చి ఆ నదిని ప్రజలకు ఉపయుక్తంగా, రాష్ట్ర ఆదాయానికి చోదక శక్తిగా తీర్చిదిద్దుతామఇ చెప్పారు. అలాగే..



హైదరాబాద్‌లో చెరువుల చెర విడిపించాల్సిందేనని, కబ్జాదారుల నుంచి విముక్తి కల్పించాల్సిందేనని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.
బతుకమ్మకుంట, సున్నం చెరువు, నల్ల చెరువు, ఫాక్స్ సాగర్, మియాపూర్ చెరువు తదితర 20 చెరువులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. తమ్మిడికుంటను అభివృద్ధి చేయాలని నిర్ణయించినప్పుడు కొంత ఇబ్బందికరమైన పరిస్థితి తలెత్తిందని, ప్రభుత్వపరంగా తీసుకున్న నిర్ణయాలు చిరకాల పరిచయమున్న నాగార్జున, ఇతర మిత్రుల మనసుకు కష్టంగా అనిపించాయని.. సర్కారు నిర్ణయం వల్ల వారికి కొంత నష్టం కూడా జరిగిందని ఆయన వెల్లడించారు. అయితే, కొందరికి నష్టం జరిగినా.. కొన్ని తరాలకు మంచి జరుగుతుందన్న ఆలోచనతోనే చెరువుల పునరుద్ధరణ, పునరుజ్జీవానినికి శ్రీకారం చుట్టామన్నారు. పెద్ద మనసుతో ఈ విషయాన్ని అర్థం చేసుకొన్న నాగార్జున రెండెకరాల స్థలాన్ని ఉదారంగా ఇచ్చి.. సినిమాల్లోనే కాదు.. నిజ జీవితంలో హీరో అని నిరూపించుకున్నారన్నారు. ఎక్కడో షూటింగ్‌లో ఉన్న ఆయన.. ప్రభుత్వం తరఫున ఆహ్వానిస్తే.. ప్రత్యేకవిమానంలో వచ్చారని చెప్పారు. నాగార్జున నిజమైన హైదరాబాదీ అని, ప్రకృతి పరిరక్షణకు ఆయన ఎప్పుడూ ముందుంటారని రేవంత్ ఆకాంక్షించారు.
వాటితోపాటు..ఇప్పటి వరకు హైటెక్ సిటీ, శిల్పారామం, హైటెక్స్ గురించి మాత్రమే మాట్లాడుకున్నారని, మూడింటి మధ్య ఉన్న తమ్మిడికుంట గురించి మాట్లాడేలా దాన్ని అభివృద్ధి చేశామని సీఎం తెలిపారు. ఐటీ ఉద్యోగులు వర్క్ ఫ్రం హోం కాదు.. వర్క్ ఫ్రం తమ్మిడికుంట చేసేలా ఏర్పాట్లు చేయాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, సీఎంసీ కమిషనర్ సృజనలకు సూచించారు. ఈ సందర్భంగా రామంతాపూర్ పెద్ద చెరువులో గుడిసెలు ఇళ్లు కోల్పోయిన 34 మందికి నాచారం-మల్లాపూర్ ప్రాంతంలో ఇందిరమ్మ ఇళ్లు కేటాయింపు పత్రాలు అందజేశారు.

ఎరువుల సబ్సిడీకి రూ.62,370 కోట్లు

మొదటిపేజీ తరువాయి

వెల్లడించింది.రబీ 202627 సీజన్‌కు సంబంధించి 2026 అక్టోబర్ 1 నుంచి 2027 మార్చి 31 వరకు పోషక ఆధారిత సబ్సిడీ (ఎన్‌బీఎస్) విధానాన్ని అమలు చేయనున్నారు. డీఏపీ, ఎన్‌పీకేఎస్ తదితర భాస్వరం, పొటాష్ ఎరువులకు ఈ సబ్సిడీ వర్తించనుంది. గత రబీ సీజన్‌తో పోలిస్తే ఈసారి సుమారు రూ.24,417 కోట్ల అదనపు నిధులను కేటాయించడం గమనార్హం.

రైతులకు సాగు ఖర్చుల నుంచి ఊరట

వ్యవసాయంలో ఎరువులు కీలకమైన ఇన్‌పుట్‌గా ఉన్నాయి. పంటల దిగుబడి, నాణ్యతపై ఎరువుల వినియోగం ప్రభావం చూపుతుంది. అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో ఎరువుల ధరలు పెరిగినప్పుడు ఆ ప్రభావం నేరుగా రైతులపై పడే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సబ్సిడీని అందించడం ద్వారా రైతులకు ఎరువులు అందుబాటు ధరల్లో లభించేలా చర్యలు చేపడుతోంది. రబీ సీజన్‌లో గోధుమలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు వంటి పంటల సాగుకు ఈ నిర్ణయం తోడ్పడనుంది.

పలు కీలక నిర్ణయాలకు ఆమోదం

కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఎరువుల సబ్సిడీతో పాటు పలు ఇతర కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సూక్ష్మ పరిశ్రమలకు క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ కోసం రూ.5,000 కోట్లు, స్టాండ్ అప్ ఇండియా పథకానికి రూ.4,111 కోట్లను ఆమోదించారు. ఢిల్లీలో యుగే యుగీన్ భారత్ మ్యూజియం నిర్మాణానికి రూ.3,230 కోట్లు, నోయిడాగ్రేటర్ నోయిడా మెట్రో విస్తరణకు రూ.2,390 కోట్లు మంజూరు చేశారు. కేంద్ర మంత్రివర్గ నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు

వాటర్ రెగ్యులేటరీ

మొదటిపేజీ తరువాయి

మంత్రి నిమ్మల రామానాయుడుతో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రభుత్వం నిర్దేశించుకున్న 36 ప్రాజెక్టులను రాబోయే రెండున్నర సంవత్సరాల్లో పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.ఈ సమీక్షలో భాగంగా ఎత్తిపోతల పథకాల మరమ్మతులు, నిర్వహణ, ఇరిగేషన్ భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు వంటి అంశాలపై ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలోని సాగునీటి ఎత్తిపోతల ప్రాజెక్టులన్నింటినీ జలహారతి కార్పొరేషన్ ద్వారా పర్యవేక్షించాలని సీఎం సూచించారు. దీనివల్ల వాటి నిర్వహణ, పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా జరుగుతుందని అభిప్రాయపడ్డారు.
అలాగే, విద్యుత్ రంగానికి ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ఉన్న తరహాలోనే, జలవనరుల కోసం కూడా ప్రత్యేకంగా ఒక వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేసే అంశంపై అధ్యయనం చేయాలని చంద్రబాబు అధికారులకు సూచించారు. ఈ కమిషన్ ఏర్పాటుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ నిర్ణయాలతో సాగునీటి రంగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

జీహెచ్ఎంసీకి జాతీయ అవార్డు

మొదటిపేజీ తరువాయి

. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అవార్డును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ ఎన్.రవికిరణ్ పాల్గొన్నారు.స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్‌లో హైదరాబాద్‌కు ఈ గుర్తింపు లభించింది. నగరంలో పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ, ఘన వ్యర్థాల శుద్ధి, మురుగునీటి నిర్వహణ, పరిశుభ్రత, ప్రజల భాగస్వామ్యం తదితర అంశాల ఆధారంగా ఈ మూల్యాంకనం చేపట్టారు.హైదరాబాద్ నగరం గత కొన్నేళ్లుగా పారిశుధ్య రంగంలో పలు గుర్తింపులు సాధించింది. 2017లో ఓడీఎఫ్ హోదా పొందగా, 2019లో ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ గుర్తింపు సాధించింది. 2021లో తెలంగాణలో తొలిసారిగా వాటర్ ప్లస్ సర్టిఫికేషన్ పొందిన స్థానిక సంస్థగా జీహెచ్ఎంసీ నిలిచింది. 2023, 2024లోనూ ఈ హోదాను కొనసాగించింది. 2024 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పది లక్షలకు పైగా జనాభా ఉన్న నగరాల విభాగంలో హైదరాబాద్ ఆరో ర్యాంకు సాధించింది.స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26లో మొత్తం 10,500 మార్కులతో పది ప్రధాన విభాగాల్లో నగరాల పనితీరును అంచనా వేశారు. పారిశుధ్యం, చెత్త వేరు చేయడం, ఇంటింటికీ చెత్త సేకరణ, ఘన వ్యర్థాల నిర్వహణ, పారిశుధ్య సదుపాయాలు, మురుగునీటి నిర్వహణ, పారిశుధ్య కార్మికుల సంక్షేమం, పౌరుల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇచ్చారు.
స్వచ్ఛ షెహర్ జోడీ కార్యక్రమంలో భాగంగా జీహెచ్ఎంసీ మంథని, చేర్యాల మున్సిపాలిటీలకు మెంటార్ సిటీగా వ్యవహరించింది. ఆయా పట్టణాల్లో పారిశుధ్య ప్రమాణాలను మెరుగుపరిచేందుకు శిక్షణ కార్యక్రమాలు, సామర్థ్య పెంపు వర్క్‌షాప్‌లు నిర్వహించింది.2026 ఏప్రిల్, మే నెలల్లో హైదరాబాద్ జంట నగరాల్లో మూడో పక్షం ద్వారా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. పారిశుధ్య మౌలిక సదుపాయాలు, చెత్త నిర్వహణ, మురుగునీటి శుద్ధి, ఇంటింటి చెత్త సేకరణతో పాటు ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నారు. జీహెచ్ఎంసీకి జాతీయ అవార్డు లభించడం నగర ప్రజలు, అధికారులు, పారిశుధ్య కార్మికులకు గర్వకారణమని అధికారులు పేర్కొన్నారు.

సీఆర్పీఎఫ్ క్యాంపుపై ఉగ్ర దాడి

బైక్‌పై వచ్చి 15 సెకన్లలో 30 రౌండ్ల కాల్పులు

శ్రీనగర్, నవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త): జమ్మూకశ్మీర్‌లో సీఆర్పీఎఫ్ క్యాంపుపై ఉగ్రవాదులు దాడికి తెగబడ్డారు. ఓ ద్విచక్ర వాహనంపై దూసుకొచ్చిన ఇద్దరు ఉగ్రవాదులు.. భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని ఏకే47 తుపాకీతో 15 సెకన్లలో 30 రౌండ్ల కాల్పులు జరిపి పారిపోయారు. ఈ దాడిలో ముగ్గురు జవాన్లకు తీవ్రగాయాలవ్వగా.. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. కుల్గాం జిల్లా మీర్‌బజార్ సమీపంలోని చెక్‌పోస్టు వద్ద బుధవారం మధ్యాహ్నం 2.15 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. దాడికి పాల్పడిన నిందితుల్లో ఒకరిని లష్కరే తోయిబాకు చెందిన విదేశీ ఉగ్రవాదిగా అనుమానిస్తున్నారు. బైక్ వచ్చి కాల్పులు జరుపుతూనే ఉగ్రవాదులు పారిపోయారని.. అప్రమత్తమైన జవాన్లు కూడా ఎదురు కాల్పులు జరిపారని ఓ సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. గాయపడిన ముగ్గురు జవాన్లలో ఇద్దరు కానిస్టేబుళ్లు, మరొకరు హెడ్ కానిస్టేబుల్ అని.. వారిని అనంతనాగ్‌లోని ఆస్పత్రికి తరలించామని వెల్లడించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వివరించారు. పారిపోయిన ఉగ్రవాదులను పట్టుకునేందుకు పెద్ద ఎత్తున సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు.

వచ్చే ఏడాది నుంచే 10+2 విధానం!

మొదటిపేజీ తరువాయి

నిర్ణయించింది. ఆధునిక అవసరాలకు అనుగుణంగా విద్యా విధానాన్ని మార్చడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.మంగళవారం విద్యాశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎం పలు కీలక సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. సంస్కరణల అమలులో ఏ ఒక్క విద్యార్థికి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.రాష్ట్రంలో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు పాఠశాల విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం పేర్కొన్నారు. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉన్నత విద్యగా పరిగణించి విద్యార్థులకు ప్రత్యేక విద్య అందించాలని సూచించారు.
విద్యార్థులకు 12వ తరగతి నుంచే నైపుణ్య శిక్షణ (స్కిల్లింగ్) అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని సీఎం స్పష్టం చేశారు.

విజయసాయిరెడ్డి..కొత్త పార్టీ పీఆర్పీ

పరివర్తన రాజనీతి పార్టీని ప్రకటించిన విజయసాయిరెడ్డి
ఏపీ రాజకీయాల్లోకి మరో కొత్త వేదిక

అమరావతినవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో నూతన పార్టీ ఆవిర్భవించింది. మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి తన కొత్త రాజకీయ పార్టీని అధికారికంగా ప్రకటించారు. పార్టీ పేరు 'పరివర్తన రాజనీతి పార్టీ' (పీఆర్పీ) అని ఆయన వెల్లడించారు. విజయవాడలో నిర్వహించిన సభలో వేదపండితుల ఆశీర్వచనాల నడుమ ఆయన పార్టీ పేరును ప్రకటించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. జెండాను కాషాయ, తెలుపు రంగులతో రూపొందించారు. జెండా మధ్యలో ధర్మచక్రం గుర్తును ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరైన మద్దతుదారులు, అభిమానులతో విజయసాయిరెడ్డి 'పీఆర్పీ' అంటూ నినాదాలు చేయించారు. సభకు వచ్చిన కార్యకర్తలు 'జై శ్రీరామ్', 'విజయసాయిరెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అభిమానులు ఆయనను భారీ గజమాలతో ఘనంగా సత్కరించారు.రాష్ట్రంలో ప్రస్తుతం స్పష్టమైన రాజకీయ శూన్యత ఉందని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు.



అధికారంలో ఉన్న టీడీపీ, ప్రతిపక్ష వైఎస్సార్సీపీ రెండింటి తీరుతో ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ఈ నేపథ్యంలో ప్రజలకు బలమైన ప్రత్యామ్నాయం అవసరమని భావించి కొత్త పార్టీని తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. రెండు పార్టీలు, రెండు కుటుంబాల రాజకీయ ఆధిపత్యానికి ముగింపు పలకడమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. దేశభక్తి, ప్రజా సంక్షేమం, ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల పరిరక్షణే ధ్యేయంగా తమ పార్టీ పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఏపీని కేవలం రెండు కుటుంబాలు మాత్రమే పాలించాలా? అని ఆయన ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు వైసీపీ కీలక నేతగా పనిచేసిన విజయసాయిరెడ్డి, ఇప్పుడు సొంతంగా పార్టీని స్థాపించి ప్రత్యక్ష రాజకీయాల్లో సరికొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు.వైసీపీలో తాను తీవ్ర అవమానాలను ఎదుర్కొన్నానని మాజీ ఎంపీ, పరివర్తన రాజనీతి పార్టీ (పీఆర్పీ) అధినేత విజయసాయిరెడ్డి అన్నారు. విజయవాడలో తన పార్టీని ప్రకటించిన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను వైసీపీని స్వచ్ఛందంగా వీడలేదని, తనను అవమానించి బలవంతంగా పార్టీ నుంచి బయటకు పంపించారని ఆయన స్పష్టం చేశారు.
వైసీపీలో ఉన్న సమయంలో తాను 70కి పైగా అవమానాలను భరించానని విజయసాయిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఒక మనిషి తట్టుకోలేని రీతిలో అక్కడ అవమానాలు జరిగాయని, ఆత్మగౌరవం దెబ్బతిన్న చోట ఎవరూ ఉండలేరని వ్యాఖ్యానించారు. వైసీపీ అధినేత జగన్ కొందరి చెప్పుడు మాటలు విని తనను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. పార్టీ కోసం ఎంతగానో శ్రమించిన తనను చివరకు అవమానకర రీతిలో బయటకు నెట్టారని పేర్కొన్నారు.
ఈ పరిణామాల నేపథ్యంలోనే సరికొత్త రాజకీయ ప్రయాణానికి శ్రీకారం చుట్టినట్లు విజయసాయిరెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి కీలక వ్యక్తులు, నాయకులు తమ కొత్త పార్టీలోకి చేరుతున్నారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు.

సంక్షేమం ఆగమైంది

మొదటిపేజీ తరువాయి

చూపుతోందని ఆరోపించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో బుధవారం నిర్వహించిన రైతు గర్జన సభలో ఆయన మాట్లాడారు.
అన్ని వర్గాల ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో పెట్టారని, ఉద్యోగులకు ఆరు నెలల్లో పీఆర్సీ ఇస్తామని చెప్పి మాట తప్పారని ఆరోపించారు. మూడేళ్ల పాలనలో ఏ వర్గానికి న్యాయం చేశారో ప్రజలు ఆలోచించాలని అన్నారు. బీడీ పరిశ్రమకు అండగా నిలిచిన నాయకుడు కేసీఆర్ అని, నిర్మల్ జిల్లాలోనే 63 వేల మంది బీడీ కార్మికులకు పెన్షన్లు అందించారని గుర్తుచేశారు.
రైతు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడిచినా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని కేటీఆర్ విమర్శించారు. వరి పంటకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి హామీ నిలబెట్టుకోలేదన్నారు. మూడు విడతలుగా రైతుబంధు అందించకుండా రైతులను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. రైతులకు నీళ్లు, కరెంటు అందకపోవడంతో వ్యవసాయం సంక్షోభంలో పడిందన్నారు.కేసీఆర్ పాలనలో 24 గంటల విద్యుత్, సమృద్ధిగా సాగునీటితో కళకళలాడిన తెలంగాణలో ప్రస్తుతం మళ్లీ చీకటి రోజులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. యాసంగి పంటకు దుక్కి దున్నొద్దని, విత్తనాలు చల్లొద్దని ప్రభుత్వం రైతులతో స్వీయ ధ్రువీకరణ పత్రాలు రాయించడమేంటని ప్రశ్నించారు.
నిర్మల్ జిల్లాలో తొమ్మిది మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని కేటీఆర్ ప్రశ్నించారు. గోదావరి పరివాహక ప్రాంతం, ఎస్ఆర్ఎస్పీ వంటి ప్రాజెక్టులు ఉన్న జిల్లాలో కరువు రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. కడెం ప్రాజెక్టు కింద సాగునీరు నిలిపివేసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.
కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు నిధులు కేటాయించకుండా వివక్ష చూపుతోందని విమర్శించారు. రాష్ట్రానికి న్యాయం చేయాలని కోరుతూ ప్రధాని మోదీ ఇంటి ఎదుట బైఠాయించి ధర్నాలు చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ఎనిమిది మంది బీజేపీ ఎమ్మెల్యేలు, ఎనిమిది మంది ఎంపీలు తెలంగాణకు న్యాయం జరిగేలా ఎందుకు పోరాడటం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, నాయకులు జాన్సన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో మిగిలిన 23 పురపాలికల ఎన్నికల షెడ్యూల్ నేడు విడుదల

అమరావతినవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):
ఆంధ్రప్రదేశ్‌లో గతంలో వాయిదా పడిన 23 పట్టణ స్థానిక సంస్థలకు (యూఎల్‌బీ) ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) పూర్తిస్థాయిలో సన్నద్ధమైంది. గురువారం (నవంబరు 12) మధ్యాహ్నం 12:30 గంటలకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అధికారికంగా ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించనున్నారు. దీంతో రాష్ట్రంలోని పలు కీలక నగరాలు, పట్టణాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి రానుంది.
రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థలు ఉండగా, వాటిలో 100 సంస్థలకు ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ పూర్తయింది. మిగిలిన 4 కార్పొరేషన్లు, 15 మున్సిపాలిటీలు, 4 నగర పంచాయతీలకు సంబంధించి హైకోర్టులో కేసులు పెండింగ్‌లో ఉండటంతో అక్టోబర్ 14న విడుదల చేసిన సాధారణ నోటిఫికేషన్‌లో వీటికి చోటు దక్కలేదు. ప్రస్తుతం వీటికి సంబంధించిన న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోవడం, వార్డుల పునర్విభజన మరియు రిజర్వేషన్ల ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేయడంతో ఎస్ఈసీ ఎన్నికల ప్రక్రియను ప్రారంభించనుంది.
నాలుగు కార్పొరేషన్ల రిజర్వేషన్ల వివరాలు ఎన్నికలు జరగనున్న నాలుగు ప్రధాన కార్పొరేషన్లలో మొత్తం 260 డివిజన్లు ఉన్నాయి. వీటిలో బీసీలకు 90, ఎస్సీలకు 35, ఎస్టీలకు 5, జనరల్ మహిళలకు 68, ఓపెన్ కేటగిరీకి 62 డివిజన్లు కేటాయించారు.
మేయర్ పదవుల రిజర్వేషన్లను పరిశీలిస్తే:
- శ్రీకాకుళం: బీసీ మహిళ (బీసీ జనరల్)
- కాకినాడ: బీసీ మహిళ
- రాజమహేంద్రవరం: ఎస్సీ (జనరల్)
- మంగళగిరితాడేపల్లి: ఎస్టీ

ఈ నాలుగు కార్పొరేషన్లతో పాటు మిగిలిన 19 పురపాలక సంస్థల పరిధిలో మొత్తం 749 వార్డులు ఉండగా, వాటిలో 174 వార్డులను ఓపెన్ కేటగిరీ కింద ఖరారు చేశారు.
ఎన్నికలు జరగనున్న పట్టణ సంస్థల జాబితా (ప్రాంతాల వారీగా):
ఉత్తరాంధ్ర: శ్రీకాకుళం కార్పొరేషన్ (60 డివిజన్లు), ఆమదాలవలస మున్సిపాలిటీ (శ్రీకాకుళం జిల్లా), రాజాం మున్సిపాలిటీ (విజయనగరం జిల్లా).
గోదావరి ఏలూరు పరిధి: కాకినాడ కార్పొరేషన్ (66 డివిజన్లు), రాజమహేంద్రవరం కార్పొరేషన్ (72 డివిజన్లు), పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు మున్సిపాలిటీలు (పశ్చిమ గోదావరి జిల్లా), చింతలపూడి నగర పంచాయతీ (ఏలూరు జిల్లా).
కృష్ణా గుంటూరు పల్నాడు పరిధి: మంగళగిరితాడేపల్లి కార్పొరేషన్ (62 డివిజన్లు), పొన్నూరు మున్సిపాలిటీ (గుంటూరు జిల్లా), గుడివాడ మున్సిపాలిటీ (కృష్ణా జిల్లా), వైఎస్ఆర్ తాడిగడప మున్సిపాలిటీ (ఎన్టీఆర్ జిల్లా), నరసరావుపేట మున్సిపాలిటీ (పల్నాడు జిల్లా), బాపట్ల మున్సిపాలిటీ (బాపట్ల జిల్లా).
ప్రకాశం నెల్లూరు పరిధి: కందుకూరు మున్సిపాలిటీ, పొదిలి నగర పంచాయతీ (ప్రకాశం జిల్లా), కావలి మున్సిపాలిటీ, అల్లూరు నగర పంచాయతీ (ఎస్పీఎస్ నెల్లూరు జిల్లా).
రాయలసీమ పరిధి: గూడూరు, శ్రీకాళహస్తి మున్సిపాలిటీలు (తిరుపతి జిల్లా), బి. కొత్తకోట నగర పంచాయతీ (అన్నమయ్య జిల్లా).
ఎన్నికల కమిషనర్ నిర్వహించే మీడియా సమావేశంలో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ గడువులతో పాటు పోలింగ్, కౌంటింగ్ తేదీల వివరాలు అధికారికంగా వెల్లడి కానున్నాయి. దీర్ఘకాలంగా పాలకవర్గాలు లేని ఈ పురపాలక సంఘాల్లో ఎన్నికల ప్రకటన వెలువడనుండటంతో స్థానికంగా రాజకీయ సందడి మొదలైంది.

తుఫాన్ దెబ్బకు నేలవాలిన వరి పంట..

రైతులకు నష్టపరిహారం అందించాలి

పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించాలని తహశీల్దార్, వ్యవసాయ అధికారులకు సర్పంచ్ వినతి



తల్లాడ/నవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త): ఇటీవల మురసు తుఫాన్ ప్రభావంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని గొల్లగూడెం గ్రామ సర్పంచ్ కోడూరి ఉమాదేవి వీర కృష్ణ దంపతులు కోరారు. ఈ మేరకు బుధవారం తహశీల్దార్ కరుణాకర్‌రెడ్డి, వ్యవసాయ అధికారి తాజుద్దీన్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లాడ, తెలగవరం, పినపాక రెవెన్యూ పరిధిలోని గొల్లగూడెం గ్రామపంచాయతీకి చెందిన రైతులు ఖరీఫ్ సీజన్‌లో పెద్దఎత్తున వరి సాగు చేశారని తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, తుఫాన్ ప్రభావంతో వరి పంట నేలవాలి తీవ్రంగా దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పెట్టిన పెట్టుబడులు చేతికందే పరిస్థితి లేక ఆర్థికంగా నష్టపోయారని పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయాలని, నష్టపోయిన ప్రతి రైతు వివరాలను సర్వేలో నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపించాలని కోరారు. అర్హులైన రైతులందరికీ త్వరితగతిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు.

41 రోజుల పాటు నిరంతరాయంగా ఉచిత అన్నప్రసాద వితరణ

తొలిరోజే 3 వేల మంది మాలధారులకు అన్నప్రసాదం కార్తీకమాస సేవా కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి దంపతులు

మిర్యాలగూడ/నవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త): ం

మిర్యాలగూడ పట్టణంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఆయన సతీమణి మాధవి దంపతులు ఉచిత అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సోదరుల బృందం ప్రతి ఏటా కొనసాగిస్తున్న సంప్రదాయంలో భాగంగా ఈ ఏడాది కూడా అయ్యప్ప, ఆంజనేయ, శివమాలలు ధరించి దీక్షలో ఉన్న భక్తుల కోసం 41 రోజుల పాటు ప్రతిరోజూ ఉచిత అన్నప్రసాద వితరణ చేపట్టనున్నారు.

ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించి, స్వయంగా దీక్షా స్వాములకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. తొలిరోజే సుమారు 3 వేల మంది అయ్యప్ప, ఆంజనేయ, శివమాలధారులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మాట్లాడుతూ కార్తీకమాసంలో దీక్షలు చేపట్టిన స్వాములకు అన్నప్రసాదం అందించడం ఎంతో పవిత్రమైన సేవా కార్యక్రమమని అన్నారు. భక్తి, సేవాభావంతో ప్రతి ఏటా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ఈసారి కూడా 41 రోజుల పాటు నిరంతరాయంగా కొనసాగిస్తామని తెలిపారు. దీక్షలో ఉన్న స్వాములందరూ ఈ అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని స్వీకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్‌పర్సన్ గుడిపాటి శిరీష నవీన్, బియ్యం మిల్లుల సంఘం ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, బత్తుల లక్ష్మారెడ్డి సోదరుల బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఐక్య క్రిస్మస్ వేడుకలు.. డిసెంబర్ 9న నిర్వహణ

పోస్టర్ ఆవిష్కరించిన ఏఐసీసీ రాష్ట్ర అధ్యక్షులు పి. ఎనోష్ కుమార్

ముఖ్య అతిథులుగా మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే మట్టా రాగమయి, ఐడీసీ చైర్మన్ ముప్పా విజయ్‌బాబు

కల్లూరు/నవంబర్ 12 (జర్నలిస్ట్ వార్త): క్రైస్తవుల ఆరాధ్య దైవమైన ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలను పురస్కరించుకొని డిసెంబర్ 9న కల్లూరులో నిర్వహించనున్న ఐక్య క్రిస్మస్ సంబరాలకు సంబంధించిన పోస్టర్‌ను అసోసియేషన్ ఆఫ్ ఇండిపెండెంట్ క్రిస్టియన్ కమిటీ (ఏఐసీసీ) రాష్ట్ర అధ్యక్షులు రెవరెండ్ పి. ఎనోష్ కుమార్ ఆవిష్కరించారు. మండల అధ్యక్షులు డాక్టర్ టి. ఎబినేజర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వేడుకల ఏర్పాట్లను వివరించారు.

ఈ సందర్భంగా ఎనోష్ కుమార్ మాట్లాడుతూ డిసెంబర్ 9, బుధవారం సాయంత్రం 6 గంటలకు కల్లూరులోని శ్రీకృష్ణ మ్యాంగో యార్డులో ఐక్య క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి హెల్పింగ్ హాండ్స్ మినిస్ట్రీస్, కాకినాడ బిషప్ పి. నటరాజన్ లాజరస్ క్రిస్మస్ సందేశాన్ని అందించనున్నట్లు వెల్లడించారు. వేడుకల్లో క్రిస్మస్ సంగీత గానాలు, ప్రత్యేక క్రిస్మస్ సందేశం, క్యాండిల్ లైట్ సర్వీస్, కేక్ కటింగ్, కొరియోగ్రఫీ తదితర ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని తెలిపారు. ఏసుక్రీస్తు జనన సందేశాన్ని ప్రజలకు చాటిచెప్పడంతో పాటు



ప్రేమ, శాంతి, సోదరభావం, సేవాగుణాలను పెంపొందించడమే ఈ వేడుకల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, టీజీ ఐడీసీ చైర్మన్ ముప్పా విజయ్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. క్రైస్తవ సోదరులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఐక్య క్రిస్మస్ వేడుకలను విజయవంతం చేయాలని ఏఐసీసీ కల్లూరు మండల కమిటీ సభ్యులు ప్రేమపూర్వకంగా ఆహ్వానించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రార్థనా విభాగం అధ్యక్షులు టి. నిర్మల్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్నాసి బాలరాజు, మీడియా విభాగం జిల్లా అధ్యక్షులు దాసరి డేవిడ్ రాజు, జిల్లా ప్రచార కార్యదర్శి దాసరి శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు డాక్టర్ టి. ఎబినేజర్, గౌరవ సలహాదారు తేలూరి సంజీవరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పి. దయాకర్, ఉపాధ్యక్షులు జాన్ పరంజ్యోతి, సుందర్ రాజు, కోశాధికారి గౌడిపేరు జీవన్ కుమార్, మహేష్, రాజశేఖర్ థామస్, శాలెం దాసన్న తదితరులు పాల్గొన్నారు.

ఇదులగూడ జంక్షన్‌లో 100 అడుగుల సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం

ప్రమాదాల నివారణే లక్ష్యం.. ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు





మిర్యాలగూడ/నవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త): మిర్యాలగూడ పట్టణంలోని ఇదులగూడ జంక్షన్ వద్ద 100 అడుగుల సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) శ్రీకారం చుట్టారు. మంగళవారం కొబ్బరికాయ కొట్టి పనులను లాంఛనంగా ప్రారంభించారు. పట్టణ ప్రజలకు సురక్షితమైన రాకపోకలు కల్పించడం, ప్రధాన రహదారిపై ప్రమాదాలను నివారించడం లక్ష్యంగా ఈ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పట్టణంలో మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు, ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఇదులగూడ జంక్షన్ వద్ద 100 అడుగుల సిమెంట్ రోడ్డు నిర్మాణం పూర్తయితే పట్టణం నుంచి ప్రధాన రహదారిపైకి వెళ్లే వాహనదారులకు, ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు రహదారి నిర్మాణం ఎంతగానో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యుడు శంకర్ నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్‌పర్సన్ గుడిపాటి శిరీష నవీన్, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. ం

వేముల లక్ష్మణ్ కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సాయం అందించాలి

భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, పిల్లల చదువులు, తల్లిదండ్రుల బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలి

కేజీకేఎస్ జనగామ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బూడిద గోపి, బాల్నే వెంకట మల్లయ్య డిమాండ్

జనగామ/బచ్చన్నపేట, నవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త): అప్పుల బాధలు, ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడి మృతిచెందిన వేముల లక్ష్మణ్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం (కేజీకేఎస్) జనగామ జిల్లా అధ్యక్షుడు బూడిద గోపి, కార్యదర్శి బాల్నే వెంకట మల్లయ్య డిమాండ్ చేశారు. బుధవారం బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామంలోని లక్ష్మణ్ నివాసానికి వెళ్లిన సంఘం జిల్లా ప్రతినిధి బృందం ఆయన భార్య స్వప్న, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదని, ఎన్ని కష్టాలు ఎదురైనా ధైర్యంగా నిలబడి వాటిని అధిగమించాలని సూచించారు. లక్ష్మణ్ మరణంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి రూ. 50



లక్షల ఆర్థిక సహాయం అందించడంతో పాటు భార్య స్వప్నకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, పిల్లల చదువుల బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని, వృద్ధులైన తల్లిదండ్రులను కూడా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఈ సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం జనగామ జిల్లా కమిటీ తరఫున కుటుంబానికి రూ. 5 వేల ఆర్థిక సహాయం అందించారు.

ఈ కార్యక్రమంలో కేజీకేఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండపల్లి శంకరయ్య, మండల అధ్యక్షుడు యాదండ్ల పరంధాములు, మండల కార్యదర్శి పోతుగంటి కృష్ణమూర్తి, జిల్లా కమిటీ సభ్యుడు బైరగోని బలరాం, మండల సామాజిక మాధ్యమాల కన్వీనర్ పోతుల ఆంజనేయులు, జనగామ మున్సిపల్ మూడో వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి, సిద్ధంకి గ్రామ సర్పంచ్ మడిపల్లి సుధాకర్, సొసైటీ అధ్యక్షుడు అంబాల రాజేశ్వర్, మాజీ సర్పంచ్ వేముల వెంకట్ గౌడ్, వేముల సంపత్ గౌడ్, వేముల జనార్దన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం..

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

తోకల రవీందర్ రెడ్డి కుటుంబ సభ్యులకు పరామర్శ..

ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే





హసన్‌పర్తి/నవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త): హసన్‌పర్తి మండలం సీతంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కీర్తిశేషులు తోకల దేవేందర్ రెడ్డి, తోకల లక్ష్మారెడ్డిల సోదరుడు తోకల రవీందర్ రెడ్డి ఇటీవల మృతి చెందడంతో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాంరెడ్డితో కలిసి మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మృతికి ఎమ్మెల్యే ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రేణుకుంట్ల అశోక్, మండల మాజీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, ఆత్మకూరు మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి, 66వ డివిజన్ అధ్యక్షుడు గొర్రె కిరణ్, 14వ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, సీనియర్ నాయకులు, మండల ముఖ్య నాయకులు, సర్పంచులు, నేతకాని కులస్తులు, గ్రామ పెద్దలు, గ్రామ నాయకులు, మహిళలు, యువకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహణ

విద్యతోనే సమాజ అభ్యున్నతి, దేశ ప్రగతి సాధ్యం విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి.. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్

నర్సంపేట/నవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త): నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ మాట్లాడుతూ విద్య అనేది వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా సమాజ అభ్యున్నతికి, దేశ ప్రగతికి బలమైన పునాది అని పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం డిగ్రీలకే పరిమితం కాకుండా నైతిక విలువలు, సామాజిక బాధ్యత, శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మక ఆలోచనలను అలవర్చుకోవాలని సూచించారు. భారత విద్యావ్యవస్థ అభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. నేటి పోటీ ప్రపంచంలో



సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. రాజనీతి శాస్త్ర విభాగ ఇన్‌చార్జ్ ఎస్. కమలాకర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతర భారతదేశంలో ఆధునిక విద్యావ్యవస్థ నిర్మాణానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ విశేష కృషి చేశారని తెలిపారు. విద్య అందరికీ అందుబాటులో ఉండాలని, సామాజిక, ఆర్థిక అసమానతల నిర్మూలనకు విద్య ప్రధాన సాధనమని ఆయన విశ్వసించారని వివరించారు. ఆజాద్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు జ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. విద్య ద్వారానే సమాజంలో సమానత్వం, సాధికారత, ప్రజాస్వామ్య విలువలు బలోపేతమవుతాయని వక్తలు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి విద్య ప్రాముఖ్యతను గుర్తించి బాధ్యతాయుతమైన పౌరుడిగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ కోఆర్డినేటర్ కందల సత్యనారాయణ, ఎస్. రజిత, డాక్టర్ సంధ్య, డాక్టర్ గాయత్రి, డాక్టర్ ఆనంద్, డాక్టర్ శివకుమార్, డాక్టర్ మోహన్, డాక్టర్ రాజేందర్, మాధవి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రజల పత్రిక
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక

తల్లాడలో ముగిసిన సర్వసభ్య సమావేశం

అభివృద్ధి పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలి.. ఎంపీడీఓ శ్రీధర్ రాజు



తల్లాడ/నవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):
తల్లాడ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీధర్ రాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండలంలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ సూచించారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు, సర్పంచులకు స్పష్టం చేశారు.సమావేశంలో పలువురు సర్పంచులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎంపీడీఓ దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ శ్రీధర్ రాజు హామీ ఇచ్చారు.

మృతుల కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ పరామర్శ.. భరోసా

అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబాలకు అండగా ఉంటామని హామీ



ఎల్కతుర్తి/నవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):ఎల్కతుర్తి మండలంలోని చింతలపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ బుధవారం పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బొంకూరి కొమురయ్యతో పాటు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు దుకిరే రాజేశ్వరరావు తండ్రి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులు కార్తీక్, క్రాంతి, దుకిరే రాజేశ్వరరావులను కలిసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కష్టకాలంలో పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పిట్టల మహేందర్, పార్టీ సీనియర్ నాయకులు శ్రీపతి రవీందర్ గౌడ్, తంగెడ మహేందర్, మేకల స్వప్న సుదర్శన్, ఏల్తూరి స్వామి, మునిగడప శేషగిరి, కడారి రాజు, తంగెడ నగేష్, బొంకూరి రజిత, గుండా ప్రతాపరెడ్డి, అంబాల రాజ్ కుమార్, మంకని చేరాలు, సాతూరి శంకర్, మదార్, వేముల శ్రీనివాస్, మేకల బాబురావు, శివాజీ, హింగే రమేష్, ఎడ్ల రవీందర్ రెడ్డి, మోరే బాబురావు, సుదర్శన్, మద్దె కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పరపల్లిలో ఎంఎస్ఎఫ్ నూతన గ్రామ కమిటీ ఎన్నిక

విద్యతోనే సామాజిక చైతన్యం..

హక్కుల సాధనకు విద్యార్థులు ముందుకు రావాలి.



వర్ధన్నపేట/నవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త): మాదిగ విద్యార్థుల్లో సామాజిక చైతన్యం, విద్యాభివృద్ధిని పెంపొందించడమే లక్ష్యంగా ఉప్పరపల్లి గ్రామంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట మండల మహాజన సోషలిస్ట్ పార్టీ ఉపాధ్యక్షుడు సీనపెల్లి రవి మాదిగ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న వర్ధన్నపేట మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు చాడ కర్ణాకర్ మాదిగ, ఎంఎస్పి మండల అధ్యక్షుడు ముత్యాల మల్లేశం మాదిగ మాట్లాడుతూ ప్రతి మాదిగ విద్యార్థి ఎంఎస్ఎఫ్ జెండా పట్టుకుని సామాజిక చైతన్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యాభివృద్ధి, సామాజిక హక్కుల సాధనలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా లభించిన అవకాశాలను సంపూర్ణంగా వినియోగించుకుని విజ్ఞానం, వివేకం, వికాసంలో రాణించాలని సూచించారు.నూతన కమిటీ వివరాలు: అధ్యక్షుడిగా సీనపెల్లి భరత్ మాదిగ, అధికార ప్రతినిధిగా సీనపెల్లి ప్రణీత్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా సీనపెల్లి కుమార్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా దినేష్ మాదిగ ఎన్నికయ్యారు.కార్యవర్గ సభ్యులుగా కట్ట మహేందర్ మాదిగ, తూల తిరుపతి మాదిగ, గుండేటి గోపీచంద్ మాదిగ, గుండేటి మహేష్ మాదిగ, సీనపెల్లి మధుకర్ మాదిగ, సీనపెల్లి హరీష్ మాదిగ, సీనపెల్లి సాయికిరణ్ మాదిగ, సీనపెల్లి రవి మాదిగ, సీనపెల్లి రాజు మాదిగ, సింగారపు శ్రీకాంత్ మాదిగ, సీనపెల్లి గణేష్ మాదిగ, అశోక్ మాదిగ తదితరులు ఎన్నికయ్యారు.

ఘనంగా జిల్లాస్థాయి యువజనోత్సవాలు

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు యువజనోత్సవాలు వేదికలు

జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఓలేటి జ్యోతి

మహబూబాబాద్/నవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):
మహబూబాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జిల్లాస్థాయి యువజనోత్సవాలు, సాంస్కృతిక కళాకారుల ఎంపిక కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సీహెచ్ మదర్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఓలేటి జ్యోతి, జిల్లా ప్రజాసంబంధాల అధికారి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సీహెచ్ మదర్ మాట్లాడుతూ యువత సన్మార్గంలో పయనిస్తూ తమలోని ప్రతిభను వెలికితీసుకునేందుకు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో యువజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువతీ యువకుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, కళా నైపుణ్యాలను ప్రదర్శించేందుకు యువజనోత్సవాలు చక్కని వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు.



జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఓలేటి జ్యోతి మాట్లాడుతూ జిల్లాస్థాయి సాంస్కృతిక కళాకారుల ఎంపికలో భాగంగా లైవ్ చిత్రలేఖనం, వ్యాసరచన, కవిత్వం, జానపద గీతాలు, జానపద నృత్యాలు, సామాజిక అంశాలపై నాటికలు తదితర పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విజేతలను ఎంపిక చేసి ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు.డీపీఆర్వో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక యువత కలిగిన దేశాల్లో భారతదేశం ముందుందని, యువతలో అపారమైన మేధస్సు, సృజనాత్మకత ఉన్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ తమలోని ప్రతిభను గుర్తించి, పోటీల్లో పాల్గొంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. పోటీల్లో చిత్రలేఖనంలో బి. పావని మొదటి బహుమతి, రక్షిత రెండో బహుమతి సాధించారు. కవిత్వంలో ఉదయ్ సోస్ మొదటి బహుమతి, భరత్ కుమార్ రెండో బహుమతి పొందారు. సామాజిక అంశాలపై నిర్వహించిన నాటిక పోటీల్లో నేరెడ తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జానపద నృత్యాల్లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల మొదటి స్థానం, ప్రభుత్వ జూనియర్ కళాశాల మహబూబాబాద్ రెండో స్థానం సాధించాయి. జానపద గీతాల విభాగంలో మహబూబాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పలు విభాగాల్లో బహుమతులు అందుకున్నారు.
ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణేష్, న్యాయనిర్ణేతలు, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రోగ్రాం అధికారులు, వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టిక అల్పాహారం

విద్యార్థుల ఆరోగ్యం, చదువుపై ఆసక్తి పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యం

ప్రతి విద్యార్థి పాఠశాలకు వచ్చి చదువుకోవాలి.. మండల పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్

ఎల్కతుర్తి/నవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అల్పాహార పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ సూచించారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పౌష్టిక అల్పాహారం అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్, ఎంపీడీవో ఎం. విజయ్ కుమార్, ఎంఈఓ చదువుల సత్యనారాయణ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు చదువుపై ఆసక్తి, ఏకాగ్రత పెంపొందించేందుకు ఈ అల్పాహార పథకం దోహదపడుతుందని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు.ప్రతి విద్యార్థి పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరై ఉన్నత చదువులు చదువుకోవాలని ఎంఈఓ చదువుల సత్యనారాయణ సూచించారు. రానున్న రోజుల్లో విద్యార్థుల ఆరోగ్య అవసరాలు, పోషక విలువలను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన ఆహార మెనూను రూపొందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లావణ్య, ఉపసర్పంచ్ జి. రాజు, కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ శైలజ, ఏపీసీ సింగిల్ విండో చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఆర్ఐ సదానందం, పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రైస్ మిల్లర్లు అగ్రిమెంట్, బ్యాంక్ గ్యారంటీ వెంటనే సమర్పించాలి

సీఎంఆర్ బియ్యం డెలివరీలో జాప్యం చేస్తే సహించేది లేదు

రోజువారీ లక్ష్యాలకు అనుగుణంగా బియ్యం అందించాలి.. అడిషనల్ కలెక్టర్ కె. అనిల్ కుమార్

మహబూబాబాద్/నవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):
జిల్లాలో ధాన్యం కేటాయింపులు పొందిన రైస్ మిల్లర్లు మిల్లర్ అగ్రిమెంట్‌తో పాటు బ్యాంక్ గ్యారంటీని వెంటనే సమర్పించాలని అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్ ఆదేశించారు. సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) బియ్యం ప్రభుత్వానికి అందించడంలో ఎలాంటి జాప్యం చేయకుండా, నిర్దేశించిన రోజువారీ లక్ష్యాలకు అనుగుణంగా డెలివరీ పూర్తి చేయాలని స్పష్టం చేశారు.
మంగళవారం మహబూబాబాద్ జిల్లాలోని రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో ఖరీఫ్ 2026-27 సీజన్‌కు సంబంధించిన ధాన్యం కేటాయింపులు, సీఎంఆర్ బియ్యం సరఫరాపై సమీక్షించారు. ధాన్యం కేటాయింపులు పొందేందుకు అర్హత కలిగిన ప్రతి రైస్ మిల్లర్ తప్పనిసరిగా మిల్లర్ అగ్రిమెంట్, బ్యాంక్ గ్యారంటీ పత్రాలను తక్షణమే సమర్పించాలని సూచించారు.
ప్రభుత్వానికి సీఎంఆర్ బియ్యం అందించే విషయంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రతిరోజూ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని మిల్లర్లకు సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ ధాన్యం కేటాయింపులు, బియ్యం డెలివరీ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.
ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి జె. రమేష్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ జి. మనోజ్ కుమార్, డిప్యూటీ తహశీల్దార్ (పౌరసరఫరాలు) తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాల్లో డిప్యూటీ సీఎం భట్టితో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సందడి

తెలంగాణ పబ్లిక్ స్కూల్‌కు శంకుస్థాపన.. మైరా క్లినిక్ ప్రారంభోత్సవంలో పాల్గొని శుభాకాంక్షలు





హనుమకొండ/వరంగల్ ఉమ్మడి జిల్లా బ్యూరోనవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ప్రజా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు మరోసారి పలు కీలక కార్యక్రమాల్లో తనదైన ముద్ర వేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి కాజీపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనడంతో పాటు హనుమకొండ నక్కలగుట్టలో నూతనంగా ఏర్పాటు చేసిన మైరా క్లినిక్‌ను ప్రారంభించారు.కాజీపేటలోని పెద్దబడి ప్రాంగణంలో నూతనంగా నిర్మించనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్‌కు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. విద్యారంగంలో మౌలిక వసతుల విస్తరణ లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎంపీ కడియం కావ్యతో కలిసి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు.అనంతరం టీపీసీసీ ఉపాధ్యక్షుడు నామిండ్ల శ్రీనివాస్ కుమార్తె డాక్టర్ మౌనిక హనుమకొండ నక్కలగుట్టలో నూతనంగా ఏర్పాటు చేసిన మైరా క్లినిక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. వైద్యరంగంలో సేవలందించేందుకు ముందుకొచ్చిన డాక్టర్ మౌనికను అభినందిస్తూ క్లినిక్ విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.
అలాగే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రెడ్‌క్రాస్ డైరెక్టర్ ఈవీ శ్రీనివాస్ కుమార్తె వివాహ వేడుకకు హాజరై శ్రీనివాస్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన వధువును ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నాయకులతో నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యలు, పార్టీ వ్యవహారాలపై చర్చించారు.
ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, కుడా చైర్మన్ గుండు సుధారాణి, హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి, వరంగల్ డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయూబ్, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ సిలువేరు శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు, చైర్మన్లు, సర్పంచులు, నియోజకవర్గ ముఖ్య నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మిరపలో నల్ల తామర కలకలం.. అప్రమత్తంగా ఉండాలి!

-సమగ్ర సస్యరక్షణ చర్యలతోనే పురుగు ఉధృతికి అడ్డుకట్ట

-పంటను నిరంతరం పరిశీలిస్తూ సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలి





వైరా/నవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):
మిరప పంటను ఆశిస్తున్న నల్ల తామర పురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, సమగ్ర సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, సీబీఐ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సూచించారు.
వైరా కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాలకు చెందిన ఉద్యాన శాఖ అధికారులు, అభ్యుదయ రైతులకు మిరపలో నల్ల తామర పురుగు ఉధృతి, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎం.వి. మధుసూదన్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో మిరప పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో నల్ల తామర పురుగు ఆశించినట్లు గుర్తించామని వెల్లడించారు. రైతులకు వివిధ మార్గాల ద్వారా సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తూ పంట నష్టాన్ని తగ్గించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.వరంగల్ ఉమ్మడి జిల్లాల నుంచి హాజరైన ఉద్యాన శాఖ అధికారులు తమ జిల్లాల్లో మిరప సాగు పరిస్థితులు, పంట వివిధ దశల్లో ఉన్న తీరు, నల్ల తామర పురుగు ఉధృతి వివరాలను శాస్త్రవేత్తలకు తెలియజేశారు. అనంతరం ఉద్యాన శాస్త్రవేత్తలు డాక్టర్ అనిత, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ పావని, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి మంజరి రైతులకు నల్ల తామర నివారణకు అనుసరించాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలను వివరించారు. పంటను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పురుగు ఉధృతిని ప్రాథమిక దశలోనే గుర్తించాలని, అవసరమైన నివారణ చర్యలను సకాలంలో చేపట్టాలని సూచించారు. మొబైల్ యాప్‌ల సహాయంతో పంటలో వచ్చే పురుగులు, తెగుళ్లను గుర్తించి వాటి నివారణకు తగిన సలహాలు పొందవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైరా ఉద్యాన అధికారి ఆకుల వేణు, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల ఉద్యాన శాఖ అధికారులు, అభ్యుదయ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతులు తమ సందేహాలను శాస్త్రవేత్తలను అడిగి నివృత్తి చేసుకున్నారు.

47 బంతుల్లో 90 పరుగులు.. విశ్వేశ్వర్ విధ్వంసం!

10 సిక్సర్లతో ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించిన వరంగల్ పోలీస్ జట్టు కెప్టెన్



వరంగల్ /నవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త): త్వరలో జరగనున్న 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడా పోటీలకు వరంగల్ పోలీస్ జట్టు సమరసన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఏడు పోలీస్ బెటాలియన్ల క్రీడాకారులతో కూడిన రేంజ్1 పోలీస్ జట్టుతో నిర్వహించిన సాధన మ్యాచ్‌లో వరంగల్ పోలీస్ జట్టు కెప్టెన్ విశ్వేశ్వర్ తన బ్యాట్‌తో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డారు.
కేవలం 47 బంతుల్లో 5 ఫోర్లు, 10 సిక్సర్లతో అజేయంగా 90 పరుగులు సాధించి మైదానంలో పరుగుల వరద పారించారు. ఆయన దూకుడైన బ్యాటింగ్‌కు ప్రత్యర్థి బౌలర్లు సమాధానం చెప్పలేకపోయారు. భారీ సిక్సర్లతో మైదానాన్ని హోరెత్తించిన విశ్వేశ్వర్ అత్యుత్తమ బ్యాటర్‌గా నిలవడమే కాకుండా 8.95 ఎంవీపీ రేటింగ్ సాధించారు.కెప్టెన్ ఇన్నింగ్స్‌తో వరంగల్ పోలీస్ జట్టులో కొత్త ఉత్సాహం నెలకొంది. రాబోయే రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడా పోటీల్లో సత్తా చాటేందుకు ఈ ప్రదర్శన జట్టు ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. సాధన మ్యాచ్‌లోనే విశ్వరూపం చూపించిన విశ్వేశ్వర్. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఇదే జోరు కొనసాగిస్తారా అన్న ఆసక్తి నెలకొంది.

36వ జాతీయ ఏఐకేఎస్ మహాసభలను జయప్రదం చేయాలి

రైతాంగం, భూములు, వ్యవసాయ రంగాన్ని కాపాడుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలి

నవంబర్ 15న నల్లగొండలో జరిగే రైతు బహిరంగ సభకు భారీగా తరలిరావాలి

హసన్‌పర్తి/నవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):
దేశ రైతాంగాన్ని, వ్యవసాయ భూములను, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తుల కబంధహస్తాల నుంచి కాపాడుకునేందుకు ప్రజలు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐకేఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గొడుగు వెంకట్ పిలుపునిచ్చారు. ఈ నెల 15 నుంచి 18 వరకు నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న 36వ జాతీయ ఏఐకేఎస్ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.
హసన్‌పర్తి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏఐకేఎస్ 36వ జాతీయ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఏఐకేఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గొడుగు వెంకట్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.రాములు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన ప్రజాసంఘాల సమావేశంలో గొడుగు వెంకట్ మాట్లాడుతూ నవంబర్ 15న నల్లగొండలో నిర్వహించే రైతు బహిరంగ సభకు జిల్లా రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.
దేశ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కుట్రలు జరుగుతున్నాయని, కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు



అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల తయారీ, సరఫరా రంగాల్లో కార్పొరేట్ సంస్థల ఆధిపత్యం పెరిగిందని, ఇప్పుడు రైతుల భూములపైనా కన్నేశాయని ఆందోళన వ్యక్తం చేశారు.
ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధరలు, భూమిపై హక్కులు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని అన్నారు. నేడు దేశ రైతాంగానికి సాగు భూములను కాపాడుకోవడమే పెద్ద సవాల్‌గా మారిందని పేర్కొన్నారు.
అభివృద్ధి, సంక్షేమం పేరుతో రోడ్లు, విమానాశ్రయాలు, రైల్వే ప్రాజెక్టులు, ఆస్పత్రుల నిర్మాణం కోసం రైతుల భూములను సేకరిస్తూ వారిని సాగుకు దూరం చేస్తున్నారని విమర్శించారు. సామాజికంగా వెనుకబడిన వర్గాలకు భూమిపై హక్కులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. భూమి, వ్యవసాయం, రైతుల జీవనాధారాన్ని కాపాడుకోవాలంటే ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

మృతురాలి కుటుంబానికి మున్సిపల్ చైర్మన్ పరామర్శ.. ఆర్థిక సాయం



వర్ధన్నపేట/ నవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట మున్సిపాలిటీలోని 8వ వార్డుకు చెందిన ఎండపెల్లి యాకమ్మ తొమ్మిది రోజుల క్రితం మృతి చెందారు. ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి ఆమె దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి అండగా నిలుస్తూ ఆర్థిక సాయం అందించారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ తిరుపెల్లి వాణికుమారస్వామి, పీఏసీఎస్ సభ్యుడు బక్కతట్ల రాజ్ యాదవ్, 12వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారెల్లి కమలాకర్, డాక్టర్ యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి రూ.1,01,116 విరాళం

నారబోయిన రాజమౌళి దంపతులకు ముదిరాజ్ సంఘం నాయకుల ఘన సన్మానం



స్టేషన్ ఘన్‌పూర్/నవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):మండలంలోని తాటికొండ గ్రామంలో సబ్‌స్టేషన్ సమీపంలో నిర్మిస్తున్న శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకొస్తున్నారు. ఆలయ నిర్మాణంలో భాగంగా స్లాబ్ నిర్మాణం కోసం నారబోయిన రాజమణి రాజమౌళి దంపతులు తమ కుమారుడు ప్రశాంత్‌తో కలిసి రూ.1,01,116 విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ చైర్మన్ పర్ష రాజు, వైస్ చైర్మన్ నారబోయిన తిరుపతి ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘం కుల పెద్దలు, నాయకులు, సభ్యులు విరాళం అందించిన రాజమణి రాజమౌళి దంపతులు, వారి కుమారుడు ప్రశాంత్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఆలయ నిర్మాణానికి ఉదారంగా విరాళం అందించిన దాతలపై నాయకులు అభినందనలు కురిపించారు. పెద్దమ్మ తల్లి ఆశీస్సులు రాజమౌళి కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆలయ నిర్మాణానికి తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణ చైర్మన్ పర్ష రాజు, శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం చైర్మన్ పండుగ భద్రయ్య, ముదిరాజ్ సంఘం పెద్దలు పండుగ బుచ్చయ్య, పండుగ రవి, నారబోయిన వెంకటయ్య, పండుగ కనకయ్య, నారబోయిన పెరుమాండ్లు, మారబోయిన ఎల్లస్వామి, నారబోయిన వెంకటరాజు, నారబోయిన రాజు, నారబోయిన సుధాకర్, పండుగ అశోక్, పుట్ట ఉప్పలయ్య, నారబోయిన కనకయ్య, నారబోయిన వెంకట్ రాజు, ముదిరాజ్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.ం

అక్రమ అండాల సేకరణ.. కేసులో ఎవరి వాటా ఎంత?

దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు -నేటి నుంచి 5 రోజులపాటు నిందితుల విచారణ

5 రోజుల పోలీస్ కస్టడీకి అనుమతిచ్చిన కోర్టు -నిందితులకు ఫెర్టిలిటీ సెంటర్లతో లింకులపై ఫోకస్


హైదరాబాద్ సిటీ, నవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):
మానవ అండాల అక్రమ దందా కేసులో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి మహిళలను హైదరాబాద్‌కు అక్రమంగా తరలించి, వారి నుంచి అండాలను సేకరించి ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ కేంద్రాలకు విక్రయిస్తున్న ముఠాను పోలీసులు ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. 8 మంది నిందితులను అరెస్టు చేసి.. 48 మంది మహిళలను ఆ ముఠా బారి నుంచి కాపాడారు. ఈ కేసును లోతుగా దర్యాప్తు చేయడానికి నిందితులను తమ కస్టడీకి ఇవ్వాలని బేగంపేట, సరూర్‌నగర్ పోలీసులు కోరగా.. సికింద్రాబాద్ న్యాయస్థానం ఐదు రోజులు పోలీస్ కస్టడీకి బుధవారం అనుమతిచ్చింది.
దీంతో వారిని పోలీసులు నేటి నుంచి విచారించనున్నారు. ఈ దందాలో ఎన్ని ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ కేంద్రాలకు సంబంధం ఉంది..? ఇప్పటివరకు ఎంతమందిని ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చారు? ఎన్ని అండాలను



సేకరించారు..? ఎంత సంపాదించారు? హార్మోన్ ఇంజక్షన్లు ఎంతమందికి ఇచ్చారు..? వాటిని ఎవరు సరఫరా చేస్తున్నారు..? అనే అంశాలను నిగ్గుతేల్చనున్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన అమిత్‌శర్మ, పశ్చిమబెంగాల్‌కు చెందిన నిక్కత్ పర్వీన్, సికింద్రాబాద్ రెజిమెంటల్ బజార్‌కు చెందిన రేష్మా ఖాతూన్, జెఫ్రీ ప్రదీప్, ఎస్‌కే పర్వీన్, విజయ్ భాగ్యారావు, పంకజ్ సోనీలు ముఠాగా ఏర్పడి అక్రమ అండాల దందా కొనసాగించారు. బెంగాల్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్ రాష్ట్రాల నుంచి పేద మహిళలకు డబ్బు ఆశ చూపించి హైదరాబాద్‌కు తీసుకొచ్చేవారు. ఈ ముఠాకు దేశవ్యాప్తంగా నెట్‌వర్క్ ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.
ఒక్కసారి మాత్రమే అండాలు సేకరిస్తామని నమ్మించి తీసుకొచ్చి.. బాధిత మహిళలకు హార్మోన్ ఇంజక్షన్లు ఇచ్చి ఒక్క నెలలో పదిసార్లు అండాలు సేకరించినట్లు గుర్తించారు. సేకరించిన ప్రతిసారి ఆ అండాలను రూ.3 లక్షలకు విక్రయించినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇలా ఒక్కో మహిళ ద్వారా సుమారు రూ.27 లక్షలు కొల్లగొట్టినట్లు అనుమానిస్తున్నారు. బాధితులకు మాత్రం రూ.10 నంచి రూ.20 వేలు మాత్రమే ఇచ్చేవారని గుర్తించారు. నిందితులతో నగరంలోని 20 ఐవీఎఫ్, ఫెర్టిలిటీ సెంటర్లకు సంబంధాలున్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిసింది. బేగంపేట సరూర్‌నగర్, ఎర్రగడ్డ ప్రాంతాల్లోని మహిళా వర్కింగ్ హాస్టళ్లలో బాధితులను ఉంచినట్లు దర్యాప్తులో తేలింది. బాధితుల్లో కొందరు యువతులు గర్భవతులుగా ఉన్నట్లు సమాచారం. వారిని సరోగసీకి ఒప్పించారా..? అనే అంశంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ హౌస్ అరెస్ట్

నవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హనుమకొండ పర్యటన నేపథ్యంలో పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత దాస్యం వినయ్ భాస్కర్‌ను ఈ ఉదయం పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. హనుమకొండ వడ్డేపల్లిలోని ఆయన నివాసానికి చేరుకున్న పోలీసులు, ఆయన బయటకు రాకుండా నిర్బంధించారు.కాజీపేట పరిధిలోని వైఎస్సార్ నగర్ నివాసితులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలనే డిమాండ్‌పై



ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వకపోతే, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటనను అడ్డుకుంటామని బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. ఈ క్రమంలో వినయ్ భాస్కర్ స్పందిస్తూ... "వైఎస్సార్ నగర్ గుడిసెవాసులకు న్యాయం చేయకపోతే భట్టి పర్యటన అడ్డుకుంటాం. పట్టాలపై స్పష్టమైన ప్రకటన చేయాలి.. లేదంటే నిరసన తప్పదు" అని స్పష్టం చేశారు.ఈ హెచ్చరికల నేపథ్యంలో ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు పోలీసులు అప్రమత్తమయ్యారు. వినయ్ భాస్కర్ ఇంటి వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, స్థానికంగా ఉన్న పలువురు బీఆర్ఎస్ ముఖ్య నేతలు, కార్యకర్తలను కూడా ముందస్తుగా అదుపులోకి తీసుకుంటున్నారు.

తెలంగాణ బస్ స్టేషన్లలో ఫ్రీ వైఫై!

నవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):
తెలంగాణలోని బస్ స్టేషన్లలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఆర్టీసీ సిద్ధమవుతోంది. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే బస్ స్టేషన్లపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా 5 వేల మందికిపైగా ప్రయాణికుల రద్దీ ఉండే 86 బస్ స్టేషన్లను గుర్తించింది. వీటిలో దశలవారీగా ఉచిత వైఫై సదుపాయం అందుబాటులోకి తీసుకురానుంది.
గుర్తించిన బస్ స్టేషన్లలో ఇప్పటికే ఒక్కో కంట్రోలర్‌ను నియమించింది. ప్రయాణికులు బస్సుల వివరాలు, రాకపోకల సమయాలు తెలుసుకునేందుకు ప్రత్యేక ఫోన్ నంబర్లను ఏర్పాటు చేసింది. కొత్త టైమ్ టేబుల్ బోర్డులను కూడా అందుబాటులోకి తీసుకురానుంది.
ప్రయాణికుల భద్రతతో పాటు బస్ స్టేషన్లలో రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు మరో కీలక నిర్ణయం తీసుకుంది. త్వరలో అన్ని బస్ స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనుంది. వీటిని సంబంధిత ప్రాంతీయ కార్యాలయాలతో పాటు ప్రధాన కార్యాలయానికి అనుసంధానించనున్నారు. తద్వారా బస్ స్టేషన్లలో పరిస్థితులను ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించే అవకాశం ఉంటుంది.

దక్షిణాదికీ విస్తరిస్తున్న ఎస్ఐఆర్ వ్యతిరేక నిరసనలు

- ఓటు హక్కుపై ఆందోళనలు.. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఉద్యమాలు ఎన్నికల జాబితాల సవరణలో పారదర్శకత ఏదీ?



నవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):

భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైనది. ప్రజలు తమ పాలకులను ఎన్నుకునేందుకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక ప్రజాస్వామ్య సాధనం ఓటు. అలాంటి ఓటు హక్కు విషయంలో ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, పౌర హక్కుల సంస్థలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. తొలుత ఉత్తరాది రాష్ట్రాల్లో తీవ్ర చర్చకు దారితీసిన ఈ ప్రక్రియ ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాలకూ విస్తరిస్తోంది. ఓటర్ల జాబితాల ప్రక్షాళన పేరుతో అర్హులైన పౌరుల ఓటు హక్కుకు భంగం కలగకూడదన్నదే నిరసనకారుల ప్రధాన డిమాండ్.**ఓటర్ల జాబితాల సవరణపై వివాదం**ఎన్నికల జాబితాల్లో నకిలీ ఓట్లు, మరణించిన వారి పేర్లు, ఒకే వ్యక్తికి పలు చోట్ల నమోదైన ఓట్లు తొలగించడం ప్రజాస్వామ్య ఎన్నికల నిర్వహణకు అవసరమే. ఓటర్ల జాబితాలు తప్పులు లేకుండా ఉండటం ఎన్నికల సంఘం బాధ్యత. అయితే ఈ ప్రక్రియలో నిజమైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా చూడటం అంతకంటే ముఖ్యమైనది. ఎస్ఐఆర్ ప్రక్రియలో పత్రాల పరిశీలన, వివరాల ధ్రువీకరణ, గణన ఫారాల పంపిణీ వంటి అంశాల్లో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ పేర్లు జాబితాలో ఉన్నాయో లేదో తెలుసుకోవడం, అవసరమైన పత్రాలు సమర్పించడం, అధికారుల చుట్టూ తిరగడం సామాన్య ప్రజలకు భారంగా మారుతోందని పలువురు చెబుతున్నారు.**దక్షిణాదిలోనూ నిరసనల వెల్లువ**ఎస్ఐఆర్‌పై వ్యతిరేకత తెలంగాణలోనూ బలంగా వ్యక్తమవుతోంది. హైదరాబాద్‌లో పౌరసంఘాలు, ప్రజాస్వామిక సంస్థలు, విద్యార్థి సంఘాలు, కార్మిక సంఘాలు, సామాజిక కార్యకర్తలు నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. ఓటర్ల జాబితాల నుంచి అర్హులైన వారి పేర్లు తొలగించకూడదని, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం కలిగించాలని డిమాండ్ చేస్తున్నారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్ ప్రాంతంలో వివిధ ప్రజాసంఘాలు మానవహారంగా ఏర్పడి తమ నిరసనను వ్యక్తం చేశాయి. ఓటు హక్కును కాపాడాలని, ఓటర్ల జాబితాల సవరణలో పారదర్శకత పాటించాలని కోరాయి. ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై కూడా విమర్శలు గుప్పించాయి.**తెలంగాణలో ఆందోళనలకు కారణాలేమిటి?**తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియపై పలు అనుమానాలు, అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి వంటి పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు పాత ఓటరు వివరాలు, నివాస మార్పులు, కుటుంబ సభ్యుల రికార్డులు, అవసరమైన పత్రాల సేకరణ సమస్యగా మారుతున్నాయి. ఉపాధి కోసం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలస వెళ్లిన కార్మికులు, అద్దె ఇళ్లలో నివసించే పేదలు, మహిళలు, వృద్ధులు, నిరక్షరాస్యులు ఈ ప్రక్రియలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. చిరునామా మారినంత మాత్రాన ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి రాకూడదు. పత్రాలు సమర్పించలేకపోయినంత మాత్రాన అర్హులైన పౌరులను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం అన్యాయం అవుతుంది.**ఎన్నికల సంఘం బాధ్యత మరింత కీలకం**ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థ. ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించడంతో పాటు ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడం దాని బాధ్యత. ఓటర్ల జాబితాల సవరణ విషయంలో రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా వ్యవహరించాలి. ఏ పార్టీకి అనుకూలంగా లేదా వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటున్నారనే అనుమానాలకు అవకాశం ఇవ్వకూడదు. ప్రతి ఓటరు తన పేరు జాబితాలో ఉందో లేదో సులభంగా తెలుసుకునే విధానాన్ని అందుబాటులోకి తీసుకురావాలి. పేర్లు తొలగించే ముందు సంబంధిత వ్యక్తులకు తగిన సమాచారం ఇవ్వాలి. అభ్యంతరాలు తెలిపేందుకు, అవసరమైన పత్రాలు సమర్పించేందుకు తగిన సమయం కల్పించాలి. అధికారుల తప్పిదాల వల్ల అర్హులైన ఓటర్లు నష్టపోకుండా ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థ ఉండాలి.**పేదలు, వలస కార్మికులపై అదనపు భారం**ఎస్ఐఆర్ ప్రక్రియలో అత్యంత ఎక్కువగా ప్రభావితమయ్యే అవకాశం ఉన్నది సామాన్య ప్రజలే. రోజువారీ కూలీ పనులు చేసుకునే కార్మికులు ఒకరోజు పని మానేసి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తే వారి కుటుంబాల జీవనోపాధిపై ప్రభావం పడుతుంది. వలస కార్మికులు తరచూ నివాస ప్రాంతాలు మారుస్తుంటారు. మహిళలకు వివాహం తర్వాత చిరునామా మారడం సాధారణం. వృద్ధుల వద్ద పాత పత్రాలు అందుబాటులో లేకపోవచ్చు. దివ్యాంగులు, నిరుపేదలు కార్యాలయాలకు వెళ్లడం కూడా కష్టంగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలకు సహాయక కేంద్రాలు ఏర్పాటు చేసి, ఇంటి వద్దే సేవలు అందించే విధానాన్ని బలోపేతం చేయాలి. ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా సులభతరమైన ధ్రువీకరణ పద్ధతులు అమలు చేయాలి.**రాజకీయ వివాదంగా మారకూడదు**ఎస్ఐఆర్‌పై రాజకీయ పార్టీలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఈ అంశం రాజకీయ వివాదంగా మారుతోంది. కొందరు నేతలు ఈ ప్రక్రియ ప్రజాస్వామ్యానికి ముప్పు కలిగిస్తోందని విమర్శిస్తుండగా, మరోవైపు ఓటర్ల జాబితాల ప్రక్షాళన అవసరమని వాదనలు వినిపిస్తున్నాయి. అయితే ఈ అంశాన్ని కేవలం రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవడం సరికాదు. ఎన్నికల జాబితాల ప్రక్షాళన అవసరమే అయినప్పటికీ, దాని పేరుతో ఏ ఒక్క అర్హుడి ఓటు హక్కు తొలగిపోకూడదు. ఎన్నికల సంఘం తన నిర్ణయాలను ప్రజలకు స్పష్టంగా వివరించి అనుమానాలను నివృత్తి చేయాలి.**ప్రజాస్వామ్యానికి ఓటు హక్కే పునాది**భారత రాజ్యాంగం ప్రతి అర్హ పౌరుడికి ఓటు హక్కును కల్పించింది. కులం, మతం, భాష, ప్రాంతం, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా ప్రతి ఓటుకు సమాన విలువ ఉంటుంది. ఓటు ద్వారా ప్రజలు ప్రభుత్వాలను ఎన్నుకోవడమే కాకుండా పాలకుల పనితీరుపై తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తారు. అలాంటి హక్కు విషయంలో నిర్లక్ష్యం జరిగితే ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం తగ్గుతుంది. ఎన్నికల ప్రక్రియపై విశ్వాసం దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంతో పాటు ప్రభుత్వాలపైనా ఉంది.**పారదర్శకతతోనే ప్రజల్లో విశ్వాసం**ఎస్ఐఆర్ ప్రక్రియపై నెలకొన్న అనుమానాలను తొలగించేందుకు ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలి. ఓటర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు అందించాలి. పేర్లు తొలగించడానికి అనుసరించే ప్రమాణాలను బహిరంగంగా ప్రకటించాలి. తొలగించిన పేర్ల వివరాలు, వాటికి గల కారణాలను సంబంధిత ఓటర్లకు తెలియజేయాలి. ఫిర్యాదులు, అభ్యంతరాల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలి. రాజకీయ పార్టీలు, పౌరసంఘాలు, ప్రజాసంఘాలతో చర్చించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి. ఓటర్ల జాబితాల సవరణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించినప్పటికీ మానవీయ కోణాన్ని విస్మరించకూడదు.

ఢిల్లీని కమ్మేస్తున్న కాలుష్య భూతం

ఏటా శీతాకాలంలో తప్పని విషవాయువుల ముప్పు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం శాశ్వత పరిష్కారం చూపడంలో పాలకుల వైఫల్యం

నవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):

దేశ రాజధాని ఢిల్లీ మరోసారి వాయు కాలుష్యం కోరల్లో చిక్కుకుంది. శీతాకాలం ప్రారంభమైందంటే చాలు.. నగరాన్ని విషపూరిత పొగమంచు కమ్మేస్తోంది. గాలి నాణ్యత ప్రమాదకర స్థాయికి పడిపోవడంతో ప్రజలు స్వచ్ఛమైన గాలి పీల్చుకోవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఏటా ఇదే పరిస్థితి పునరావృతమవుతున్నా ప్రభుత్వాలు శాశ్వత పరిష్కారం చూపలేకపోతున్నాయి. కాలుష్య నియంత్రణకు తాత్కాలిక చర్యలు కాకుండా సమగ్ర విధానాలు అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.**ఏటా పునరావృతమవుతున్న సమస్యఢిల్లీలో** వాయు కాలుష్యం ఒక్కరోజులో ఏర్పడిన సమస్య కాదు. దశాబ్దాలుగా పెరుగుతున్న పట్టణీకరణ, వాహనాల సంఖ్య, పారిశ్రామిక కార్యకలాపాలు, నిర్మాణ రంగం విస్తరణ దీనికి ప్రధాన కారణాలుగా మారాయి. వీటికి తోడు పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగులబెట్టడం కూడా కాలుష్య తీవ్రతను పెంచుతోంది. ముఖ్యంగా పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో వరి కోతల అనంతరం మిగిలిన పంట అవశేషాలను కాల్చడం వల్ల వెలువడే పొగ ఢిల్లీ పరిసర ప్రాంతాలను ప్రభావితం చేస్తోంది. శీతాకాలంలో గాలి వేగం తగ్గడం, వాతావరణంలో తేమ పెరగడం, ఉష్ణోగ్రతల మార్పుల కారణంగా కాలుష్య కారకాలు పైకి వెళ్లకుండా నేలమట్టానికి సమీపంలోనే పేరుకుపోతున్నాయి. దీంతో నగరమంతా పొగమంచు ఆవరించి జనజీవనం అస్తవ్యస్తమవుతోంది. **వాహనాల పొగే ప్రధాన సమస్యల్లో ఒకటి** ఢిల్లీలో వాహనాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వ్యక్తిగత వాహనాల వినియోగం అధికమవడం, పాత డీజిల్ వాహనాల నుంచి వెలువడే పొగ, రవాణా రంగంలో ఇంధన వినియోగం కాలుష్యాన్ని తీవ్రతరం చేస్తున్నాయి. రహదారులపై వాహనాల రద్దీ పెరగడంతో గంటల తరబడి ట్రాఫిక్‌లో నిలిచిపోయే వాహనాల నుంచి వెలువడే పొగ గాలిలో కలుస్తోంది. మరోవైపు పరిశ్రమలు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, నిర్మాణ పనుల నుంచి వెలువడే కాలుష్య కారకాలు కూడా సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. నగరంలో నిర్మాణ



పనుల సందర్భంగా దుమ్ము నియంత్రణకు తగిన చర్యలు తీసుకోకపోవడం పరిస్థితిని మరింత దిగజారుస్తోంది.**ప్రజారోగ్యానికి పెను ముప్పు**వాయు కాలుష్యం ప్రభావం కేవలం పర్యావరణానికే పరిమితం కావడం లేదు. ప్రజల ఆరోగ్యంపై దీర్ఘకాలిక దుష్ప్రభావాలు చూపుతోంది. ముఖ్యంగా గాలిలో ఉండే పీఎం 2.5, పీఎం 10 వంటి సూక్ష్మ ధూళి కణాలు శ్వాస ద్వారా ఊపిరితిత్తుల్లోకి చేరి అనేక అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు, ఇప్పటికే శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వారు ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆస్తమా, బ్రాంకైటిస్, ఊపిరితిత్తుల సమస్యలు, గుండె సంబంధిత వ్యాధుల ముప్పు పెరుగుతోంది. దీర్ఘకాలం కలుషిత గాలిని పీల్చడం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది. పాఠశాలలకు వెళ్లే పిల్లలు, ఉదయం వ్యాయామం చేసే వృద్ధులు, రహదారులపై పనిచేసే కార్మికులు ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందించలేని పరిస్థితి ఏర్పడటం ఆందోళనకరం.**తాత్కాలిక చర్యలతో ప్రయోజనం ఎంత?**కాలుష్యం తీవ్రత పెరిగినప్పుడల్లా ప్రభుత్వాలు కొన్ని అత్యవసర చర్యలు చేపడుతున్నాయి. నిర్మాణ పనులపై ఆంక్షలు విధించడం, వాహనాల రాకపోకలను నియంత్రించడం, పాఠశాలల నిర్వహణలో మార్పులు చేయడం, ప్రజలకు మాస్కులు ధరించాలని సూచించడం వంటి చర్యలు తీసుకుంటున్నాయి. అయితే ఇవన్నీ కాలుష్యం తీవ్రత పెరిగిన తర్వాత చేపట్టే తాత్కాలిక చర్యలుగానే మిగిలిపోతున్నాయి. కాలుష్యానికి కారణమవుతున్న మూలాలను గుర్తించి వాటిని నియంత్రించడంలో మాత్రం ఆశించిన పురోగతి కనిపించడం లేదు. ప్రతి ఏడాది శీతాకాలం వచ్చినప్పుడు అత్యవసర పరిస్థితులు ప్రకటించడం, ఆ తర్వాత పరిస్థితి కొంత మెరుగుపడగానే సమస్యను పక్కన పెట్టడం సరైన విధానం కాదు. ఏడాది పొడవునా అమలు చేసే కార్యాచరణ అవసరం.**రైతులకు ప్రత్యామ్నాయాలు కల్పించాలి**ఢిల్లీ కాలుష్య చర్చలో పంట వ్యర్థాల దహనం ప్రధాన అంశంగా మారుతోంది. అయితే రైతులను నిందించడం మాత్రమే సమస్యకు పరిష్కారం కాదు. పంట కోత అనంతరం పొలాల్లో మిగిలే వ్యర్థాలను తొలగించడానికి రైతులకు తగిన యంత్రాలు, ఆర్థిక సహాయం, సాంకేతిక పరిజ్ఞానం అందించాలి. పంట అవశేషాలను పశుగ్రాసం, సేంద్రియ ఎరువులు, జీవ ఇంధనాల తయారీకి వినియోగించే పరిశ్రమలను ప్రోత్సహించాలి. రైతులకు ఆర్థికంగా లాభదాయకమైన ప్రత్యామ్నాయాలు కల్పిస్తే పంట వ్యర్థాలను కాల్చే అవసరం తగ్గుతుంది. వ్యవసాయ సమస్యను పర్యావరణ సమస్యతో అనుసంధానించి పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.**ప్రజా రవాణాను బలోపేతం చేయాలి**వాహన కాలుష్యాన్ని తగ్గించాలంటే ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి. మెట్రో రైళ్ల సేవలను విస్తరించడంతో పాటు విద్యుత్ బస్సుల సంఖ్యను పెంచాలి. నగరంలోని అన్ని ప్రాంతాలకు ప్రజా రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలి. వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గేలా ప్రజల్లో అవగాహన కల్పించాలి. పాత, అధిక కాలుష్యాన్ని వెదజల్లే వాహనాలపై కఠిన నిబంధనలు అమలు చేయాలి. విద్యుత్ వాహనాల కొనుగోలుకు ప్రోత్సాహకాలు అందించాలి. కేవలం వాహనాలపై ఆంక్షలు విధించడం కాకుండా ప్రజలకు ప్రత్యామ్నాయ ప్రయాణ సౌకర్యాలు కల్పించినప్పుడే ఫలితాలు కనిపిస్తాయి.**పరిశ్రమలపై కఠిన పర్యవేక్షణ అవసరం**పారిశ్రామిక కాలుష్య నియంత్రణలోనూ ప్రభుత్వాలు రాజీ పడకూడదు. పరిశ్రమల్లో కాలుష్య నియంత్రణ పరికరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. నిబంధనలు పాటించని పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలి. నిర్మాణ రంగంలో దుమ్ము వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక మార్గదర్శకాలు అమలు చేయాలి. రహదారుల శుభ్రత, చెత్త నిర్వహణ, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాల దహనాన్ని అరికట్టడం వంటి చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలి. నగరంలో పచ్చదనాన్ని పెంచేందుకు పెద్దఎత్తున మొక్కలు నాటడంతో పాటు ఉన్న చెట్లను సంరక్షించాలి. అభివృద్ధి పేరుతో చెట్లను విచక్షణారహితంగా తొలగించడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది.**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం కీలకం**ఢిల్లీ వాయు కాలుష్యం ఒక్క రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పరిష్కరించగల సమస్య కాదు. ఢిల్లీతో పాటు పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల మధ్య సమన్వయం అవసరం.

మూడో భాష ఎంపికలో విద్యార్థులకు స్వేచ్ఛ లేదా?

త్రిభాషా విధానంపై కొనసాగుతున్న వివాదం హిందీని బలవంతంగా రుద్దడంపై దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకోవాలి

నవంబర్ 11 (జర్నలిస్ట్ వార్త):

భారతదేశం భిన్న భాషలు, సంస్కృతులు, సంప్రదాయాలకు నిలయమైన దేశం. ఇక్కడ ప్రతి భాషకు ప్రత్యేక చరిత్ర, ప్రాధాన్యత, అస్తిత్వం ఉన్నాయి. భాష అనేది కేవలం భావాలను వ్యక్తం చేసే సాధనం మాత్రమే కాదు.. ఒక ప్రాంత ప్రజల సంస్కృతి, ఆత్మగౌరవం, జీవన విధానానికి ప్రతిబింబం. అలాంటి భాషా వైవిధ్యం కలిగిన దేశంలో విద్యార్థులు ఏ భాషను చదవాలి? ఎన్ని భాషలు నేర్చుకోవాలి? మూడో భాషగా ఏ భాషను ఎంచుకోవాలి? అనే అంశాలు ఇప్పుడు మరోసారి జాతీయస్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానం-2020లోని త్రిభాషా సూత్రం, సీబీఎస్ఈ అమలు చేస్తున్న భాషా విధానంపై వివాదం కొనసాగుతోంది. విద్యార్థులకు మూడో భాష ఎంపికలో స్వేచ్ఛ ఉండాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తున్నప్పటికీ, ఈ విషయంలో సీబీఎస్ఈ తగినంత వెసులుబాటు కల్పించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.**మూడో భాషపై సీబీఎస్ఈ వైఖరి**సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) మూడు భాషల విధానాన్ని అమలు చేసే విషయంలో అనుసరిస్తున్న విధానం విద్యార్థుల, తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా మూడో భాషను ఎంచుకునే విషయంలో విద్యార్థులకు మరింత స్వేచ్ఛ కల్పించాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులు తమ ఆసక్తి, భవిష్యత్తు అవసరాలు, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా భాషను ఎంచుకునే అవకాశం ఉండాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. అయితే సీబీఎస్ఈ ఈ అభిప్రాయాలను పూర్తిస్థాయిలో పరిగణనలోకి



తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. భాషలను నేర్చుకోవడం విద్యార్థుల జ్ఞానాన్ని పెంచాలి తప్ప, వారిపై అదనపు విద్యా భారాన్ని మోపే విధంగా ఉండకూడదు. భాషా విద్యలో ఆసక్తి, అభిరుచులకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఒకే విధానాన్ని అందరిపై అమలు చేయడం సమంజసం కాదు.**సుప్రీంకోర్టు సూచనలు ఎందుకు?**మూడు భాషల విధానానికి సంబంధించి విద్యార్థులు ఎదుర్కొనే ఇబ్బందులపై సుప్రీంకోర్టు కూడా పలు సందర్భాల్లో స్పందించింది. ముఖ్యంగా ప్రస్తుత ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిదో తరగతుల విద్యార్థులపై ఈ విధానం వల్ల పడే భారాన్ని పరిశీలించాల్సిన అవసరాన్ని కోర్టు ప్రస్తావించింది. ఏడో, ఎనిమిదో, తొమ్మిదో తరగతుల విద్యార్థులకు పదో తరగతిలో సంబంధిత భాషకు బోర్డు పరీక్షకు బదులుగా అంతర్గత మూల్యాంకనం వర్తించే పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని, ఆరవ తరగతి విద్యార్థులకు కూడా మినహాయింపు కల్పించే అంశాన్ని పరిశీలించాలని సూచించింది. పాఠశాలలు పూర్తిస్థాయిలో సిద్ధమయ్యే వరకు ఈ విధానాన్ని 2026కు బదులుగా 2027 నుంచి అమలు చేయవచ్చా? అన్న అంశాన్ని కూడా గతంలో ప్రశ్నించింది. విద్యార్థులపై ఒక్కసారిగా కొత్త భాషా భారం పడకుండా చూడాలన్నదే కోర్టు ఆందోళన. అయితే ఈ విషయంలో సీబీఎస్ఈ తగినంత సానుకూలత చూపడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.**తొమ్మిదో తరగతిలో కొత్త భాష నేర్చుకోవడం ఎంతవరకు సాధ్యం?**ఎనిమిదో తరగతి వరకు రెండో భారతీయ భాషను చదవని విద్యార్థులు తొమ్మిదో తరగతిలో అకస్మాత్తుగా కొత్త భాషను నేర్చుకోవాల్సి వస్తే అనేక సమస్యలు ఎదురవుతాయి. ఇప్పటికే గణితం, సైన్స్, సామాజిక శాస్త్రాలు, ఆంగ్లం వంటి సబ్జెక్టులతో విద్యార్థులపై చదువుల ఒత్తిడి ఉంటుంది. ఇలాంటి సమయంలో కొత్త భాషను తప్పనిసరిగా నేర్చుకోవాలని నిబంధన విధిస్తే వారి చదువులపై అదనపు భారం పడుతుంది. భాషను నేర్చుకోవడానికి సమయం, ఉపాధ్యాయుల బోధన, తగిన పాఠ్యపుస్తకాలు అవసరం. ప్రతి పాఠశాలలోనూ అవసరమైన భాషా ఉపాధ్యాయులు అందుబాటులో ఉండకపోవచ్చు. విద్యార్థులకు భాష నేర్చుకునే అవకాశం కల్పించాలే తప్ప, అందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించకుండా నిబంధనలు విధించడం వల్ల ఆశించిన ప్రయోజనం ఉండదు.**ఇంగ్లీష్‌ను విదేశీ భాషగా చూడాలా?**ఈ భాషా వివాదంలో మరో ముఖ్యమైన అంశం ఇంగ్లీష్ భాషకు సంబంధించినది. ఇంగ్లీష్‌ను విదేశీ భాషగా పరిగణించాలా? లేక భారతదేశంలో విస్తృతంగా వినియోగంలో ఉన్న భాషగా గుర్తించాలా? అన్న ప్రశ్న కూడా చర్చకు వస్తోంది. గత మూడు శతాబ్దాలుగా భారతదేశంలో ఇంగ్లీష్ విస్తృతంగా వినియోగంలో ఉంది. విద్యారంగం, న్యాయవ్యవస్థ, పరిపాలన, వాణిజ్యం, సాంకేతిక రంగాల్లో ఇంగ్లీష్ కీలక పాత్ర పోషిస్తోంది. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల మధ్య అనుసంధాన భాషగా కూడా ఉపయోగపడుతోంది. ముఖ్యంగా సమాచార సాంకేతిక రంగం, అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాల్లో ఇంగ్లీష్ పరిజ్ఞానం భారతీయ యువతకు ఎంతో ఉపయోగపడుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాలు సాధించాలంటే విద్యార్థులకు ఇంగ్లీష్ పరిజ్ఞానం అవసరమనే విషయాన్ని విస్మరించలేం.**ప్రాంతీయ భాషల పరిరక్షణతో పాటు ప్రపంచ భాషలకూ ప్రాధాన్యత**ప్రాంతీయ భాషలను ప్రోత్సహించడం ఎంత ముఖ్యమో, ప్రపంచ భాషలను నేర్చుకునే అవకాశాలను కల్పించడం కూడా అంతే అవసరం. విద్యార్థులు తమ మాతృభాషతో పాటు ఇంగ్లీష్‌ను నేర్చుకుంటూ, మూడో భాషగా తమకు ఆసక్తి ఉన్న భాషను ఎంచుకునే స్వేచ్ఛ ఉండాలి. స్పానిష్, ఫ్రెంచ్, జర్మన్ వంటి విదేశీ భాషలు నేర్చుకోవాలనుకునే విద్యార్థులకు కూడా అవకాశాలు ఉండాలి.



నిశ్చితార్థం చేసుకున్న అర్ష్‌దీప్ సింగ్

● న్యూజిలాండ్‌లో ప్రేయసి సమ్రీన్ కౌర్‌కు ఉంగరం తొడిగిన టీమిండియా యువ పేసర్

ఇంటర్నెట్ డెస్క్: టీమిండియా యువ ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ తన జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాడు. తన ప్రేయసి, నటి సమ్రీన్ కౌర్‌తో న్యూజిలాండ్‌లో నిశ్చితార్థం చేసుకున్నాడు. బుధవారం (నవంబర్ 11) జరిగిన ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలను సమ్రీన్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకుంది.ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అర్ష్‌దీప్ తనకు ఉంగరం తొడిగిన ప్రత్యేక క్షణాలను సమ్రీన్ అభిమానులతో పంచుకోవడంతో నెటిజన్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ జంటకు పెద్ద సంఖ్యలో శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.ఇటీవలే అర్ష్‌దీప్ తన ప్రేమ బంధాన్ని బహిరంగంగా వెల్లడించాడు. ఇప్పుడు నిశ్చితార్థంతో తమ బంధాన్ని మరో అడుగు ముందుకు తీసుకెళ్లాడు. అర్ష్‌దీప్ సహచర క్రికెటర్లు గుర్నూర్ బ్రార్, నమన్ ధీర్ తదితరులు కూడా ఈ జంటకు అభినందనలు తెలిపారు.క్రికెట్‌లో తన బౌలింగ్‌తో అభిమానులను ఆకట్టుకుంటున్న అర్ష్‌దీప్.. వ్యక్తిగత జీవితంలోనూ కొత్త ప్రయాణానికి శ్రీకారం చుట్టడంతో అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ముంబై ఇండియన్స్ కెప్టెన్సీపై ఉత్కంఠ!

● రోహిత్ శర్మకు మళ్లీ పగ్గాలు అప్పగిస్తారా?

● తొందరపడి నిర్ణయం తీసుకోబోమన్న ఫ్రాంచైజీ



ఇంటర్నెట్ డెస్క్, నవంబర్ 11: ఐపీఎల్-2027 సీజన్‌కు ముందు ముంబై ఇండియన్స్ జట్టులో కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్ జట్టులోకి వెళ్లిపోవడంతో ముంబై ఇండియన్స్ తదుపరి కెప్టెన్ ఎవరనే అంశంపై క్రికెట్ వర్గాల్లో చర్చ మొదలైంది. రెండు సీజన్లుగా జట్టుకు నాయకత్వం వహించిన హార్దిక్ జట్టును వీడటంతో ఇప్పుడు ఆ బాధ్యతలు ఎవరికి అప్పగిస్తారన్న ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.**రోహిత్ శర్మ పేరుపై భారీ చర్చ** హార్దిక్ పాండ్యా స్థానంలో ముంబై ఇండియన్స్ మాజీ కెప్టెన్ రోహిత్ శర్మకు తిరిగి జట్టు పగ్గాలు అప్పగిస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. రోహిత్ నాయకత్వంలో ముంబై ఇండియన్స్ ఐదుసార్లు ఐపీఎల్ టైటిల్ సాధించింది. జట్టుతో అతడికి ఉన్న అనుబంధం, నాయకత్వ అనుభవం నేపథ్యంలో మరోసారి కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు.అయితే రోహిత్ ఒక్కడే కెప్టెన్సీ రేసులో లేడు. భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, యువ ఆటగాడు తిలక్ వర్మ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. వీరిలో ఎవరికి అవకాశం దక్కుతుందన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.**కెప్టెన్సీపై ముంబై ఇండియన్స్ స్పందన**ఈ పరిణామాల నేపథ్యంలో ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ కెప్టెన్సీ అంశంపై స్పందించింది. ఇప్పుడే తొందరపడి ఎలాంటి నిర్ణయాలు తీసుకోబోమని స్పష్టం చేసింది. రాబోయే సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే కెప్టెన్ ఎంపికపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించింది. సరైన సమయంలో జట్టు కెప్టెన్సీపై అధికారిక ప్రకటన చేస్తామని తెలిపింది.ఫ్రాంచైజీ ప్రకటనతో రోహిత్ శర్మకు మళ్లీ నాయకత్వ బాధ్యతలు దక్కుతాయా? లేక మరో ఆటగాడికి అవకాశం కల్పిస్తారా? అన్న ఉత్కంఠ మరింత పెరిగింది. ప్రస్తుతానికి కెప్టెన్ ఎంపికపై ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని ముంబై యాజమాన్యం సంకేతాలిచ్చింది.**హార్దిక్ స్థానంలో అర్ష్‌దీప్ సింగ్**ఆటగాళ్ల బదిలీల్లో భాగంగా హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్ జట్టుకు వెళ్లగా, భారత యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ముంబై ఇండియన్స్ జట్టులోకి వచ్చాడు. ఈ మార్పు కూడా జట్టు కూర్పుపై చర్చకు దారితీసింది. కొత్త సీజన్‌లో జట్టు వ్యూహాలు, ఆటగాళ్ల పాత్రలు ఎలా ఉండబోతున్నాయన్నది ఆసక్తికరంగా మారింది.**రిటెన్షన్, మినీ వేలంపై ఆసక్తి**నవంబర్ 17న ఆటగాళ్ల రిటెన్షన్ గడువు ముగియనుంది. అనంతరం డిసెంబర్ 16న గోవాలో ఐపీఎల్ మినీ వేలం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ముంబై ఇండియన్స్ జట్టు కూర్పు, ఆటగాళ్ల ఎంపిక, కెప్టెన్సీ నిర్ణయం కీలకంగా మారాయి. వేలానికి ముందే కెప్టెన్ విషయంలో స్పష్టత వస్తుందా? లేక వేలం తర్వాత ప్రకటిస్తారా? అన్నది వేచి చూడాల్సి ఉంది.మొత్తానికి హార్దిక్ పాండ్యా జట్టును వీడటంతో ముంబై ఇండియన్స్ నాయకత్వ బాధ్యతలపై కొత్త చర్చ మొదలైంది.

ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో

నీరజ్‌కు కాంస్యం

2028 లాస్‌ఏంజెలిస్ ఒలింపిక్స్‌కు అర్హత.. భారత్‌కు రెండో కోటా

దోహా, నవంబర్ 11: భారత షూటర్ నీరజ్ కుమార్ అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాడు. ఖతార్‌లోని దోహాలో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ విభాగంలో కాంస్య పతకం సాధించాడు. ఈ విజయంతో 2028లో అమెరికాలోని లాస్‌ఏంజెలిస్‌లో జరగనున్న ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు. ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు ఇది రెండో ఒలింపిక్ కోటా కావడం విశేషం.**ఫైనల్లో మూడో స్థానం**ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో నీరజ్ కుమార్ 346.5 పాయింట్లు సాధించి మూడో స్థానంలో నిలిచాడు. వ్యక్తిగత తటస్థ అథ్లెట్ల తరఫున బరిలోకి దిగిన దిమిత్రి పిమెనోవ్ 362.8 పాయింట్లతో స్వర్ణ పతకం సాధించడంతోపాటు జూనియర్ ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. స్లోవేకియాకు చెందిన పాట్రిక్ జానీ 357.2 పాయింట్లతో రజత పతకాన్ని దక్కించుకున్నాడు.నీరజ్ చివరి దశ వరకు రజత పతక పోటీలో ఉన్నప్పటికీ కీలక సమయంలో 9.4 పాయింట్ల షాట్ కారణంగా రెండో స్థానాన్ని కోల్పోయాడు. అయినప్పటికీ నిలకడైన ప్రదర్శనతో కాంస్య పతకాన్ని సాధించి ఒలింపిక్స్ కోటాను ఖాయం చేసుకున్నాడు.**క్వాలిఫికేషన్‌లో అగ్రస్థానం**ఫైనల్‌కు ముందు జరిగిన అర్హత పోటీల్లో నీరజ్ అద్భుత ప్రదర్శన చేశాడు. మొత్తం 591 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచాడు. మరో భారత షూటర్ ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్ 586 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించాడు. అయితే ఫైనల్లో ఐశ్వర్య 323.7 పాయింట్లతో ఐదో స్థానానికి పరిమితమయ్యాడు.**జట్టు విభాగంలోనూ కాంస్యం**పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ జట్టు విభాగంలోనూ భారత్ కాంస్య పతకాన్ని సాధించింది. నీరజ్ కుమార్, ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్, అఖిల్ షియోరన్ కలిపి 1,751 పాయింట్లు సాధించారు. చెక్ రిపబ్లిక్ 1,754 పాయింట్లతో స్వర్ణం, నార్వే 1,752 పాయింట్లతో రజతం గెలుచుకున్నాయి. ఒక్క పాయింట్ తేడాతో భారత్ రజతాన్ని కోల్పోయింది.**భారత్‌కు రెండో ఒలింపిక్ కోటా**ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత షూటింగ్ జట్టుకు ఇది రెండో ఒలింపిక్ కోటా. అంతకుముందు పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో జయపాల్ మాల్వియా రజత పతకం సాధించి తొలి కోటాను అందించాడు. తాజాగా నీరజ్ కుమార్ సాధించిన కాంస్యంతో భారత్ ఖాతాలో మరో కోటా చేరింది. ప్రపంచ స్థాయి పోటీల్లో వ్యక్తిగత పతకం



సాధించాలన్న తన లక్ష్యం నెరవేరిందని నీరజ్ ఆనందం వ్యక్తం చేశాడు. ఈ విజయంతో భారత షూటింగ్ జట్టుకు ఒలింపిక్స్ సన్నాహాల్లో మరింత ఉత్సాహం లభించింది.

చిన్న వయసులోనే కోహ్లీని ఇంటర్వ్యూ చేసిన ఆర్యవీర్ సెహ్వాగ్!

- తొమ్మిదేళ్ల నాటి వీడియో మళ్లీ వైరల్.. యువ క్రికెటర్‌కు కోహ్లీ ఇచ్చిన విజయ రహస్యం

న్యూఢిల్లీ, నవంబర్ 11: భారత మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్ ప్రస్తుతం అండర్-19 ఆసియా కప్‌లో తన బ్యాటింగ్‌తో వార్తల్లో నిలుస్తున్నాడు. యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో అద్భుతమైన 160 పరుగుల ఇన్నింగ్స్ ఆడిన అతడి పేరు ఒక్కసారిగా క్రికెట్ అభిమానుల నోట వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఆర్యవీర్‌కు సంబంధించిన తొమ్మిదేళ్ల క్రితం నాటి ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో మళ్లీ వైరల్‌గా మారింది. చిన్న వయసులోనే టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని ఇంటర్వ్యూ చేసిన ఆ వీడియో నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది.**2017లో కోహ్లీతో ప్రత్యేక ఇంటర్వ్యూ**2017లో స్టార్ స్పోర్ట్స్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో అప్పటి టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీని చిన్నారి ఆర్యవీర్ ఇంటర్వ్యూ చేశాడు. అప్పటికి అతడి వయసు సుమారు తొమ్మిదేళ్లు. చేతిలో మైక్ పట్టుకుని ఎంతో ఆసక్తిగా కోహ్లీని ప్రశ్నలు అడిగాడు. మూడు ఫార్మాట్లలోనూ భారత జట్టుకు నాయకత్వం వహిస్తున్న కోహ్లీతో ఆ చిన్నారి జరిపిన సంభాషణ అప్పట్లోనూ అభిమానులను ఆకట్టుకుంది. తాజాగా ఆర్యవీర్ అద్భుత ఇన్నింగ్స్ ఆడటంతో ఈ పాత వీడియో మరోసారి తెరపైకి వచ్చింది.**తండ్రితో కోహ్లీ తొలి పరిచయం ఎలా?**ఇంటర్వ్యూలో ఆర్యవీర్ అడిగిన ప్రశ్నల్లో ఒకటి ఆసక్తికరంగా నిలిచింది. తన తండ్రి వీరేంద్ర సెహ్వాగ్‌తో కోహ్లీకి తొలిసారి పరిచయం ఎలా ఏర్పడిందని ప్రశ్నించాడు. దీనికి కోహ్లీ చిరునవ్వుతో సమాధానమిచ్చాడు. ఢిల్లీలో తనకు, సెహ్వాగ్‌కు పరిచయమున్న ఓ రాష్ట్రస్థాయి కోచ్ ద్వారా ఈ పరిచయం ఏర్పడిందని వివరించాడు. అండర్-17 క్రికెట్‌లో తాను తొలిసారి డబుల్ సెంచరీ సాధించిన తర్వాత ఓ కార్యక్రమంలో సెహ్వాగ్‌ను కలిసినట్లు గుర్తుచేసుకున్నాడు. ఆ రోజు జరిగిన పరిచయం



తనకు ఇప్పటికీ గుర్తుందని తెలిపాడు.**ఆశిష్ నెహ్రా ఫొటోపై ప్రశ్న** అదే ఇంటర్వ్యూలో ఆర్యవీర్ మరో ఆసక్తికరమైన ప్రశ్నను కోహ్లీ ముందు ఉంచాడు. చిన్న వయసులో ఆశిష్ నెహ్రా తనకు ట్రోఫీ అందిస్తున్న ప్రసిద్ధ ఫొటోను ప్రస్తావించాడు. భవిష్యత్తులో నెహ్రా తన కెప్టెన్సీలోనే ఆడతాడని అప్పట్లో ఊహించారా? అన్న తరహాలో ప్రశ్నించాడు. దీనిపై కోహ్లీ తన అనుభవాన్ని పంచుకుంటూ యువతకు విలువైన సందేశం ఇచ్చాడు.**పెద్ద కలలు కనాలి.. నమ్మకంతో ముందుకు సాగాలి**జీవితంలో ఉన్నత లక్ష్యాలను పెట్టుకోవాలని, వాటిని సాధించగలననే నమ్మకంతో ముందుకు సాగాలని కోహ్లీ ఆర్యవీర్‌కు సూచించాడు. పెద్దగా ఆలోచించాలని, ఏదైనా సాధించగలననే ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలని చెప్పాడు. కోహ్లీ ఇచ్చిన ఈ సందేశం ప్రస్తుతం వీడియోలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. చిన్ననాటి ఆర్యవీర్‌కు ఇచ్చిన ఈ స్ఫూర్తిదాయక మాటలు ఇప్పుడు అతడు క్రికెట్‌లో రాణిస్తున్న సమయంలో మళ్లీ చర్చకు వచ్చాయి.**యూఏఈపై ఆర్యవీర్ అద్భుత ఇన్నింగ్స్**ఇటీవల అండర్-19 ఆసియా కప్‌లో యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో ఆర్యవీర్ తన బ్యాటింగ్ ప్రతిభను చాటుకున్నాడు. 168 బంతులు ఎదుర్కొని 17 ఫోర్లు, ఏడు సిక్సర్లతో 160 పరుగులు సాధించాడు. మరో ఓపెనర్ వీకే వినీత్‌తో కలిసి 193 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. వీరిద్దరి ప్రదర్శనతో భారత్ నిర్ణీత ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 309 పరుగులు చేసింది. అనంతరం యూఏఈని ఓడించి 70 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో భారత జట్టు సెమీఫైనల్‌కు చేరుకుంది.ఈ ఇన్నింగ్స్ ఆర్యవీర్ కెరీర్‌లో తొలి యూత్ వన్డే శతకంగా నిలిచింది. అంతకుముందు నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ అతడు అజేయంగా 72 పరుగులు సాధించాడు. వరుసగా మెరుగైన ప్రదర్శనలతో తనలోని ప్రతిభను చాటుకుంటున్నాడు.**కోహ్లీ ఆటతీరు అంటే ఆర్యవీర్‌కు అభిమానం**తన తండ్రి వీరేంద్ర సెహ్వాగ్ దూకుడైన బ్యాటింగ్ శైలితో పాటు విరాట్ కోహ్లీ ఆటతీరుపై కూడా ఆర్యవీర్‌కు ప్రత్యేక అభిమానం ఉంది. కోహ్లీ బ్యాటింగ్‌లోని కొన్ని అంశాలను తన ఆటలోనూ అనుసరించాలని కోరుకుంటున్నట్లు గతంలో వెల్లడించాడు. కేవలం తండ్రి శైలిలోనే కాకుండా కోహ్లీ తరహాలోనూ ఆడాలని ఉందని తెలిపాడు. యూఏఈపై ఆడిన 160 పరుగుల ఇన్నింగ్స్‌తో ఆర్యవీర్ తనదైన గుర్తింపు తెచ్చుకునే దిశగా అడుగులు వేస్తున్నాడు.తొమ్మిదేళ్ల క్రితం కోహ్లీని ప్రశ్నలు అడిగిన చిన్నారి.. ఇప్పుడు భారత అండర్-19 జట్టులో కీలక ఆటగాడిగా ఎదుగుతుండటంపై అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో కోహ్లీ ఇచ్చిన సలహాలను గుర్తుచేసుకుంటూ ఈ వీడియోను విస్తృతంగా పంచుకుంటున్నారు. రాబోయే మ్యాచ్‌ల్లో నూ ఆర్యవీర్ ఎలా రాణిస్తాడన్న ఆసక్తి నెలకొంది.

పంజాబ్ జట్టులోకి హార్దిక్ పాండ్యా.. శ్రేయస్‌కు మద్దతుగా సందేశం!

- నా కెప్టెన్ శ్రేయస్.. నా కోచ్ రికీ పాంటింగ్..

పంజాబ్ జట్టులో కొత్త ప్రయాణంపై హార్దిక్ స్పందన

స్పోర్ట్స్ డెస్క్, నవంబర్ 11: ఐపీఎల్-2027 సీజన్‌కు ముందు భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కీలక జట్టు మార్పుతో వార్తల్లో నిలిచాడు. ముంబై ఇండియన్స్ నుంచి పంజాబ్ కింగ్స్ జట్టులోకి మారిన అతడు.. కొత్త జట్టులో తన పాత్రపై సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించాడు. పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ప్రధాన కోచ్ రికీ పాంటింగ్‌కు మద్దతు ప్రకటిస్తూ చేసిన పోస్టు క్రికెట్ అభిమానుల దృష్టిని ఆకర్షించింది.**శ్రేయస్ నాయకత్వంలో ఆడేందుకు సిద్ధం**పంజాబ్ కింగ్స్‌లో చేరిన అనంతరం హార్దిక్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ప్రత్యేక సందేశాన్ని పంచుకున్నాడు. "సత్ శ్రీ అకాల్.. నా కెప్టెన్ శ్రేయస్.. నా కోచ్ రికీ.. నా జట్టు.. యావత్ పంజాబ్. మీకు అండగా నేను ఉంటాను" అంటూ పేర్కొన్నాడు. ఈ సందేశం ద్వారా శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో ఆడేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశాడు. గతంలో కెప్టెన్‌గా వ్యవహరించిన హార్దిక్.. కొత్త జట్టులో శ్రేయస్ నాయకత్వానికి మద్దతు ప్రకటించడం



ఆసక్తికరంగా మారింది.**భారీ ట్రేడింగ్ ఒప్పందం**ఐపీఎల్ చరిత్రలో కీలక ఆటగాళ్ల బదిలీల్లో ఒకటిగా నిలిచే ఈ ఒప్పందంలో భాగంగా హార్దిక్ పాండ్యా ముంబై ఇండియన్స్ నుంచి పంజాబ్ కింగ్స్‌కు మారాడు. ప్రతిగా పంజాబ్ జట్టు స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌ను ముంబై ఇండియన్స్‌కు పంపించింది. ఈ మార్పును ఐపీఎల్ అధికారికంగా కూడా ధ్రువీకరించింది. హార్దిక్ పంజాబ్ జట్టులో రూ.18 కోట్ల పారితోషికంతో కొనసాగనున్నాడు. అర్ష్‌దీప్ సింగ్ కూడా తన ప్రస్తుత రూ.18 కోట్ల పారితోషికంతోనే ముంబై జట్టులోకి వెళ్లాడు.**ముంబైతో రెండో విడత ప్రయాణానికి ముగింపు**హార్దిక్ పాండ్యా 2015లో తొలిసారి ముంబై ఇండియన్స్ జట్టులోకి వచ్చాడు. తన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. 2015, 2017, 2019, 2020 సీజన్లలో ముంబై టైటిళ్లు సాధించిన జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. ఏడు సీజన్ల పాటు ముంబై తరఫున ఆడిన అనంతరం 2022లో గుజరాత్ టైటాన్స్‌కు మారాడు. ఆ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తూ తొలి సీజన్‌లోనే టైటిల్ అందించాడు. 2023లోనూ గుజరాత్‌ను ఫైనల్‌కు చేర్చాడు.

అంతర్జాతీయ ప్రజల పత్రిక
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక
గురువారం 12 నవంబర్ 2026

శర్వానంద్ 'భోగి' సినిమా విడుదల వాయిదా



యంగ్ హీరో శర్వానంద్ కథానాయకుడిగా, దర్శకుడు సంపత్ నంది కాంబినేషన్‌లో రూపొందుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి' విడుదల వాయిదా పడింది. ఈ మేరకు చిత్ర నిర్మాణ సంస్థ శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బుధవారం సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. అనుకోని కారణాల వల్ల సినిమా విడుదలను వాయిదా వేయాల్సి వచ్చిందని, త్వరలోనే సరికొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని వెల్లడించింది.ఈ మేరకు చిత్రబృందం ఒక ప్రకటన విడుదల చేస్తూ.. "'భోగి' మా అందరికీ ఎంతో ప్రత్యేకమైన ప్రాజెక్ట్. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా, అంకితభావంతో, ప్యాషన్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ప్రేక్షకులకు థియేటర్లలో ఒక గొప్ప అనుభూతిని అందించాలనే సంకల్పంతో మొదటి నుంచీ పనిచేస్తున్నాం. అయితే కొన్ని ఊహించని కారణాల వల్ల సినిమా విడుదలను వాయిదా వేస్తున్నాం. విడుదల విషయంలో సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఎలాంటి పుకార్లను, ఊహాగానాలను ఎవరూ నమ్మవద్దు. త్వరలోనే కొత్త విడుదల తేదీని అధికారికంగా ప్రకటిస్తాం" అని స్పష్టం చేసింది.ఈ ప్రణాళిక మార్పు వల్ల కలిగిన అసౌకర్యానికి విచారం వ్యక్తం చేసిన నిర్మాతలు, చిత్రాన్ని మరింత ఉన్నతంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు తమకు ప్రేక్షకుల మద్దతు, సహనం అవసరమని కోరారు. ప్రేక్షకులు ఎదురుచూసే సమయానికి తగిన పూర్తి న్యాయం చేస్తామని మేకర్స్ హామీ ఇచ్చారు. వాస్తవానికి ఈ సినిమాను రేపు (నవంబర్ 12న) ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేయాలని గతంలో నిర్ణయించారు.ఈ చిత్రంలో శర్వానంద్ 'గంగ' అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన పాత్ర వివరాలు ఇప్పటికే సినీ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించాయి. ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. 1960ల కాలం నాటి నేపథ్యంలో, తెలంగాణ మరియు మహారాష్ట్ర సరిహద్దుల్లోని ఒక ఊహాజనిత గ్రామంలో జరిగే కథాంశంతో ఈ పీరియడ్ యాక్షన్ డ్రామాను దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్నారు.సాంకేతిక విభాగంలో ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా, కిశోర్ కుమార్ అరోకియా సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కిరణ్ కుమార్ మన్నె ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు. పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా రూపుదిద్దుకుంటున్న 'భోగి' చిత్రాన్ని తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు

ప్రియుడ్ని పెళ్లాడిన 'ఇరుముడి' హీరోయిన్ ప్రియా భవానీ శంకర్



ప్రముఖ నటి ప్రియా భవానీ శంకర్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. తన ప్రియుడు రాజ్ వేల్‌ను ఆమె పెళ్లాడారు. నేడు (నవంబర్ 11న) ఉదయం చెన్నైలో వీరి వివాహం అత్యంత నిరాడంబరంగా, సంప్రదాయబద్ధంగా జరిగింది. సినిమా పరిశ్రమలో సాధారణంగా కనిపించే ఆర్భాటాలు, డెస్టినేషన్ వెడ్డింగ్స్ వంటి వేడుకలకు దూరంగా ఉంటూ, అత్యంత సాదాసీదాగా ఈ శుభకార్యాన్ని నిర్వహించారు.
ఈ పెళ్లి వేడుకలో ప్రియా భవానీ శంకర్ సాంప్రదాయ ఎరుపు రంగు చీరలో మెరిసిపోగా, వరుడు రాజ్ వేల్ తెల్లటి పంచెకట్టులో కనిపించారు. వివాహానికి ఇరు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహిత మిత్రులు మాత్రమే హాజరయ్యారు. వేడుకకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఎలాంటి హంగులు లేకుండా ఇంత సింపుల్‌గా వివాహం చేసుకోవడంపై నెటిజన్లు, అభిమానులు నూతన దంపతులను ప్రశంసిస్తూ శుభాకాంక్షలు తెలుపుతున్నారు.
ప్రియా భవానీ శంకర్, రాజ్ వేల్ ఇద్దరూ కాలేజీ రోజుల్లో క్లాస్‌మేట్స్. అప్పటి నుంచే వీరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. దాదాపు 10 ఏళ్లుగా వీరి బంధం కొనసాగుతోంది. ఈ విషయాన్ని ప్రియ ఎప్పుడూ దాచలేదు. గతంలో పలు ఇంటర్వ్యూలు, సోషల్ మీడియా పోస్టుల ద్వారా తమ ప్రేమను ధ్రువీకరించారు. వీరిద్దరూ కలిసి ఇప్పటికే ఒక ఇంటిని కూడా కొనుగోలు చేశారు. ఇరు కుటుంబాల పెద్దల అంగీకారంతో ఇప్పుడు అధికారికంగా ఒక్కటయ్యారు.
న్యూస్ రీడర్‌గా కెరీర్ ప్రారంభించిన ప్రియా భవానీ శంకర్, ఆ తర్వాత బుల్లితెర సీరియళ్ల ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 2017లో 'మేయాద మాన్' చిత్రంతో తమిళ వెండితెరకు పరిచయమై, పలు విజయవంతమైన సినిమాల్లో నటించారు. తెలుగులో 'కల్యాణం కమనీయం', 'భీమా', 'జీబ్రా' చిత్రాల్లో నటించిన ఆమె, కమల్ హాసన్ 'భారతీయుడు 2'తో పాటు నాగచైతన్య 'దూత' వెబ్ సిరీస్‌లోనూ మెప్పించారు. ఇటీవల విడుదలైన 'ఇరుముడి' చిత్రం ఘన విజయం సాధించి, తెలుగు ప్రేక్షకుల నుంచి ఆమెకు విశేష ఆదరణ దక్కింది. ప్రస్తుతం 'డిమాంటీ కాలనీ' ప్రాజెక్టులతో పాటు పలు క్రేజీ చిత్రాల్లో ఆమె నటిస్తున్నారు. వివాహ జీవితంలోకి అడుగుపెట్టిన ప్రియా భవానీ శంకర్, రాజ్ వేల్ దంపతులకు సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు వెల్లువెత్తిస్తున్నారు.

టాక్సిక్' చిత్రంలో రొమాంటిక్ సీన్స్.. కియారా అద్వానీకి భర్త సిద్ధార్థ్ మద్దతు



రాకింగ్ స్టార్ యశ్ కథానాయకుడిగా తెరకెక్కిన పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్'లో కొన్ని సన్నివేశాలపై బాలీవుడ్ నటి కియారా అద్వానీ సోషల్ మీడియా వేదికగా విమర్శలను ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆమె భర్త, నటుడు సిద్ధార్థ్ మల్హోత్రా ఆమెకు అండగా నిలిచారు.దర్శకురాలు గీతు మోహన్‌దాస్ రూపొందించిన ఈ సినిమాలో కియారా 'నాదియా' అనే సర్కస్ కళాకారిణి పాత్రను పోషించారు. సినిమాలోని కొన్ని సన్నిహిత సన్నివేశాలను ఉద్దేశించి కొందరు నెటిజన్లు ఆమెపై ట్రోలింగ్ చేశారు. వివాహం తర్వాత ఇలాంటి పాత్రలు చేయడంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పోస్టులు పెట్టారు. ఈ ట్రోలింగ్‌పై సిద్ధార్థ్ మల్హోత్రా సానుకూలంగా స్పందిస్తూ భార్యకు మద్దతు పలికారట. ఈ విషయాన్ని కియారా స్వయంగా వెల్లడించారు. విమర్శలు చేసేవారికి ఇతరుల వ్యక్తిగత జీవితం తెలియదని... విమర్శలను పట్టించుకోవద్దని సిద్ధార్థ్ చెప్పారట. ఇలాంటి వ్యాఖ్యలను పట్టించుకుని మానసిక ప్రశాంతతను కోల్పోవద్దని సూచించారట. మరోవైపు, తోటి నటి హుమా ఖురేషి కూడా ఈ వ్యవహారంపై స్పందిస్తూ, సినీ పరిశ్రమలో మహిళా నటుల పట్ల చూపే ద్వంద్వ ప్రమాణాలు సరికావని ట్రోలింగ్‌ను తీవ్రంగా ఖండించారు. వృత్తిపరమైన నటనను, వ్యక్తిగత జీవితాన్ని వేరుగా చూడాలని పలువురు సినీ విశ్లేషకులు కూడా అభిప్రాయపడుతున్నారు.



సిద్ధూ జొన్నలగడ్డ కొత్త సినిమా ప్రారంభం.. నిర్మాతగా సుకుమార్!



టాలీవుడ్ యంగ్ హీరో సిద్ధూ జొన్నలగడ్డ మరో ఆసక్తికరమైన ప్రాజెక్టుతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. #Siddhu10 అనే వర్కింగ్ టైటిల్ తో తెరకెక్కనున్న ఈ కొత్త సినిమా బుధవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తొలి షాట్‌కు క్లాప్ కొట్టి సినిమాను లాంఛనంగా ప్రారంభించారు. ఈ నెల చివర్లో రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుంది. తొలుత ఓ పాటను చిత్రీకరించనున్నారు.
మోహన్ బి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని స్టార్ డైరెక్టర్ సుకుమార్ నిర్మిస్తున్నాడు. ఆయనతో పాటు ప్రముఖ నిర్మాతలు బన్నీ వాసు, అన్మోల్ శర్మ, అశోక్ బండిరెడ్డి సంయుక్తంగా నిర్మాణ బాధ్యతలు చేపట్టారు. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ సినిమాలో సిద్ధూ జొన్నలగడ్డ సరసన నయన్ సారిక కథానాయికగా నటించనుంది. మూడు జాతీయ అవార్డులు అందుకున్న సంగీత దర్శకుడు జి.వి. ప్రకాశ్ కుమార్ బాణీలు సమకూర్చనున్నాడు.సినిమా ప్రారంభోత్సవానికి సంబంధించిన ఫొటోలను సుకుమార్ సోషల్ మీడియాలో పంచుకున్నాడు. దేవుడి ఆశీస్సులతో, ఎంతో ఉత్సాహంగా #Siddhu10 ప్రయాణం మొదలైందని పేర్కొన్నాడు. త్వరలోనే ఓ అందమైన ప్రేమకథను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని తెలిపాడు.
మరోవైపు దర్శకుడు మోహన్ కూడా సినిమా ప్రారంభానికి ముందు భావోద్వేగభరితమైన పోస్టు పెట్టాడు. ఓ కథకుడి కల వెండితెరపై సాకారమయ్యే దిశగా తొలి అడుగు పడిందని, ప్రేమలోని మాధుర్యాన్ని ఆవిష్కరించే అందమైన కలయికగా ఈ సినిమా నిలుస్తుందని పేర్కొన్నాడు. చిత్రంలోని మిగతా నటీనటులు, సాంకేతిక బృందం వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

'ఇట్లు అర్జున' చిత్రానికి సెన్సార్ పూర్తి.. విడుదలకు సిద్ధం



'ఇట్లు అర్జున'. మహేశ్ ఉప్పాల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ నుంచి క్లియరెన్స్ లభించింది. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా 'యూ/ఏ' సర్టిఫికెట్ జారీ చేసింది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ 'వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్' సోషల్ మీడియా వేదికగా అధికారికంగా వెల్లడించింది.నిజానికి ఈ చిత్రం అక్టోబర్ 30నే ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల విడుదల వాయిదా పడింది. ప్రస్తుతం సెన్సార్ సహా అన్ని కార్యక్రమాలు పూర్తి కావడంతో, ఈ చిత్రాన్ని నవంబర్ 13న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు.ఈ సినిమాకు టాలీవుడ్‌లో మంచి క్రేజ్ ఉండటానికి ప్రధాన కారణం దీని నిర్మాణ భాగస్వామ్యం. ప్రముఖ దర్శకుడు వెంకీ కుడుముల 'వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్' బ్యానర్‌పై ఈ చిత్రాన్ని స్వయంగా నిర్మించగా, స్టార్ హీరో అక్కినేని నాగార్జున ఈ సినిమాను సమర్పిస్తున్నారు. ఈ చిత్రంతో అనీష్ హీరోగా వెండితెరకు పరిచయమవుతుండగా, మహేశ్ ఉప్పాల దర్శకుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నారు.ఇటీవల విడుదలైన ఈ చిత్ర ట్రైలర్ ప్రేక్షకులలో ఆసక్తిని రేకెత్తించింది. కథ ప్రకారం.. కథానాయకుడు అర్జున్ (అనీష్) మాట్లాడలేని దివ్యాంగుడైనప్పటికీ, చోరీలలో ఎంతో నేర్పరి. నగరంలో జరిగిన ఓ పెద్ద దొంగతనం కేసులో పోలీసులు అతడి కోసం గాలిస్తుంటారు. మరోవైపు, చదువే లోకంగా భావించే క్రమశిక్షణ గల అమ్మాయి కీర్తి (అనశ్వర రాజన్)తో అర్జున్ ప్రేమలో పడతాడు. అర్జున్ మంచివాడనే నమ్మకంతో కీర్తి కూడా అతడిని ఇష్టపడుతుంది. అయితే ఊహించని రీతిలో సుమారు రూ. 1000 కోట్లకు సంబంధించిన ఓ పెన్ డ్రైవ్ వ్యవహారంలో ఒక ప్రమాదకరమైన ముఠా అర్జున్, కీర్తిల వెంటపడుతుంది. అటు పోలీసులు, ఇటు నేర ముఠా ఇద్దరూ వీరిని వెంటాడే క్రమంలో ఏం జరిగింది అనే ఉత్కంఠభరిత కథనంతో సినిమా రూపొందినట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది.
ఈ సినిమాకు ఉన్నత స్థాయి సాంకేతిక నిపుణులు పనిచేశారు. సౌత్ టాప్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ఈ చిత్రానికి స్వరాలు సమకూర్చారు. రాజా మహదేవ్ సినిమాటోగ్రఫీ అందించగా, రామ్ కుమార్ ఎ ప్రొడక్షన్ డిజైనర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. కోటి కె ఎడిటింగ్ చేయగా, దిలీప్ సుబ్బరాయన్ యాక్షన్ సన్నివేశాలను కొరియోగ్రఫీ చేశారు. నవంబర్ 13న రానున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో వేచి చూడాలి.